
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT ANANTAPUR | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

అన్ని కేటగిరీలలో ఆలిండియా ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థుల మార్కులు





స్థలాభావం వలన మిగిలిన అందరి మార్కులు ప్రకటించలేకపోతున్నాం.

తల్లిదండ్రుల్లారా గమనించండి ! నారాయణలో చేరకముందు, నారాయణ లాంగ్‌టర్మ్‌లో చేరిన తరువాత మార్కుల వ్యత్యాసాన్ని గమనించండి

NAME	NEET-2023 నారాయణలో లాంగ్ టర్మ్ తరువాత	NEET-2022 నారాయణలో లాంగ్‌టర్మ్ ముందు	DIFF MARKS
P S KRISHNA AMRUTH	644	241	403
C BORRA CHITRA	600	353	247
TUSHARA REDDY A	542	308	234
A.DURGANANDA REDDY	555	323	232
AKUMALLA.ABHIGNA	553	324	229
MUKKAMALLA DEVI	602	380	222
CHERLAPALLY SANJAY	550	330	220
E.VINOD GOUD	517	306	211
M LAKSHMIKANTH	583	379	204
P.AKSHARA	531	332	199
A.ASHOK KUMARA	627	437	190
PULI.GAUTAMI	503	313	190
B.SRISHARAN	531	345	186
G.TEJA CHANDRA REDDY	521	335	186
GANDHE DEEKSHITHA	512	336	176
BURANI.JAVALI	521	347	174

NAME	NEET-2023 నారాయణలో లాంగ్ టర్మ్ తరువాత	NEET-2022 నారాయణలో లాంగ్‌టర్మ్ ముందు	DIFF MARKS
C SHANMUKH AVINASH	555	387	168
C ROHITH KUMAR	557	391	166
MOIN KHAN MD	576	412	164
PURVA DIXIT	643	481	162
PONNAM.SHRUTHI	532	370	162
MD MUDASSIR	680	520	160
ADE.SAI VARDHAN	519	361	158
T SOUMYA	539	382	157
G.SAHITHI	563	407	156
SHAIK MADIHA T	540	385	155
P.SURYA SRI	540	385	155
CHANDAN REDDY. RAVI	530	377	153
NUTHI ESHWAR	523	370	153
Y RAMYA YEDURURI	652	506	146
DODDAKA JAHNAVI	561	424	137
K KEERTHI CHANDANA	534	420	114

Many More...

నారాయణ విద్యాసంస్థలు-ఇండియా



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT ANANTAPUR | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సశస్త్ర సీమాబల్‌లో కొలువులు

1,656 పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలపై కథనం - 7లో



నష్టాల్లోంచి లాభాల్లోకి..

85 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. నిఫ్టీ 40 పాయింట్లు అప్ - 7లో



'వేట' మొదలైంది..

2 నెలల విరామం తర్వాత మత్స్యకారులు మళ్లీ చేపల వేటకు సిద్ధమవుతున్నారు. దీంతో వారి గ్రామాల్లో సందడి నెలకొంది.

వివరాలు 2లో ▸



అనాథలకు అమ్మతోడు

దత్తత నిబంధనలను కేంద్రం సులభతరం గా మార్చింది. ఈ నేపథ్యంలో దత్తత ఆవశ్య కత, దరఖాస్తు చేయు విధానంపై కథనం.

వివరాలు 6లో ▸



వాళ్లంతే.. చెప్పులేసుకోరు

ఎండ ఉన్నా చెప్పులు వేసుకోరు.. ఆకలి వేసినా బయట తిండి తినరు.. మేమింతే అంటున్న తిరుపతి జిల్లా వేమన ఇండ్లపై కథనం.

వివరాలు 8లో ▸

డీఆర్‌డీవో సైంటిస్ట్.. భారీ వేతనం

డీఆర్‌డీవో సైంటిస్ట్–బి పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, భవిష్యత్ కెరీర్‌పై ప్రత్యేక కథనం

వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగులకు స్పెషల్ పే పెంపు



వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ పే పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 11వ వేతన సవరణ సిఫార్సుల మేరకు స్పెషల్ పేను గరిష్ఠంగా 33 శాతం వరకు పెంచింది. ఈ సవరించిన ప్రత్యేక వేతనాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

వివరాలు 2లో ▸

ఫోన్లలో పాస్‌వర్డ్‌లు జాగ్రత్త!



బ్యాంకు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వంటి ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను 17 శాతం మంది ప్రజలు తమ మొబైల్‌లోనే భద్ర పర్చుకుంటున్నారని లోకల్ సర్కిల్ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఇది సురక్షితం కాని.. పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం వీడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివరాలు 8లో ▸

ఫిషరీస్ యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం



పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫిషరీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. 2023–24 విద్యా సంవత్సరంలో కోర్సుల నిర్వహణ కోసం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక తరగతి గదులను మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు.

వివరాలు 6లో ▸

నాలుగో పోర్టుతో మహర్దశ

కేసెజ్ పోర్టుతో పారిశ్రామిక నగరంగా కాకినాడ

- రూపురేఖలు మారనున్న ఉప్పాడ, తొండంగి
- స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు
- రూ.2,213 కోట్లతో 1,944 ఎకరాల్లో నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న పనులు.. మరో 18 నెలల్లో అందుబాటులోకి
- అన్నవరం – కేసెజ్ మధ్య రూ.300 కోట్లతో ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణం
- అన్నవరం – కాకినాడ మధ్య రూ.1,480 కోట్లతో 4 లేన్ల రహదారి
- ఇప్పటికే యాంకరేజ్, డీప్‌వాటర్, రవ్వ క్యాప్టివ్ పోర్టులతో పలు పరిశ్రమల ఏర్పాటు



చురుగ్గా సాగుతున్న కేసెజ్ పోర్టు పనులు

కేసెజ్ నుంచి చంద్రశేఖర్ మైలవరపు

ఇప్పటికే మూడు పోర్టులతో అలరారుతున్న కాకినాడ మరో పోర్టు రాకతో పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందనుంది. డీప్‌వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టు, రవ్వ క్యాప్టివ్ పోర్టులను కలిగి ఉన్న కాకినాడ సిగలో మరో పోర్టు జత చేరనుంది. కాకినాడ సెజ్‌లో సుమారు రూ.2213 కోట్లతో అరబిందో ఇన్‌ఫ్రా కంపెనీ పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో పోర్టును అభివృద్ధి చేస్తోంది. కేసెజ్ పోర్టుతో భారీ పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా పారిశ్రామిక నగరంగా వేగంగా విస్తరించి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

1,944 ఎకరాల్లో కేసెజ్ పోర్టు

కాకినాడ డీప్‌వాటర్ పోర్టుతో ఇప్పటికే కోరమాండల్, నాగార్జున ఫెర్టిలైజర్స్, ప్యారీస్ షుగర్స్, నూనె శుద్ధి యూనిట్లు లాంటి పలు పరిశ్రమలు ఏర్పాటు కాగా కొత్త పోర్టు, కాకినాడ సెజ్ ద్వారా భారీ పరిశ్రమలు రానున్నాయి. యాంకరేజ్ పోర్టు బియ్యం, సిమెంట్, మొక్కజొన్న లాంటి ఎగుమతులకే పరిమితం కాగా రవ్వ పోర్టును ఓఎన్‌జీసీ సొంత అవసరాల కోసం నిర్మించారు. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు మాత్రమే ఆధునిక బెర్తులతో

మిగతా 2వ పేజీలో ▶

సొంతూరిలోనే పని దొరికింది



పోర్టు పనులు ప్రారంభం కాకముందు ఇతర చోట్లకు వెళ్లి హేచరీస్‌లో పనులు చేశా. పోర్టు నిర్మాణ పనులు మొదలయ్యాక నాకు సొంతూరిలోనే ఉపాధి లభించింది. పోర్టు కోసం మా కుటుంబం మూడు ఎకరాల భూమి ఇచ్చింది. మాకు పూర్తి పరిహారం లభించింది. పోర్టు కార్యకలాపాలు మొదలైన తర్వాత ఇక్కడే ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

– సత్తిబాబు, అవులమంద గ్రామం

సైన్సు, ఆర్ట్స్‌కే ప్రాధాన్యం

టెన్త్ తరువాత 14% మందే కామర్స్ సబ్జెక్టుకు మొగ్గు

- తక్కిన వారంతా సైన్సు, ఆర్ట్స్ విభాగాల్లోనే చేరిక
- దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్
- గత పదేళ్ల ఇంటర్ విద్యా గణాంకాలతో కేంద్రం నివేదిక
- ఇంటర్లో 2012లో ఆర్ట్స్ విద్యార్థులు 30 లక్షలు.. ఇప్పుడు 40 లక్షలు
- సైన్సులో 30 లక్షల నుంచి 42 లక్షలకు చేరికలు
- కామర్స్‌లో 2012లో 13.7 లక్షలు.. ఇప్పుడు 14.4 లక్షలు
- ఏపీలో 76 శాతం విద్యార్థులు సైన్స్ వైపే మొగ్గు
- తెలంగాణ, తమిళనాడులో 60 శాతం పైగా సైన్స్‌లో చేరిక



సైన్సు, ఆర్ట్స్‌లో స్థిరమైన చేరికలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా టెన్త్ తరువాత హయ్యర్ సెకండరీ (ఇంటర్మీడియెట్) తరగతుల్లో చేరే విద్యార్థుల్లో ఎక్కువ మంది సైన్సు, ఆర్ట్స్ స్ట్రీమ్స్ (విభాగాలు)కే ప్రాధాన్యమిస్తున్నారు. గత 10 ఏళ్లలో (2012 నుండి 2022 వరకు) హయ్యర్ సెకండరీ తరగతుల్లోకి వచ్చే విద్యార్థుల్లో అత్యధిక శాతం సైన్సు, ఆర్ట్స్ గ్రూపుల్లోకి వస్తుండగా.. 14 శాతం మంది మాత్రమే కామర్స్ స్ట్రీమ్ ఎంచుకుంటున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత పదేళ్లలో హయ్యర్ సెకండరీ తరగతుల అధ్యయన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

ఆ నివేదిక ప్రకారం.. 10వ తరగతి తర్వాత ఆర్ట్స్, సైన్స్ స్ట్రీమ్‌లలో చేరే విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగింది. దేశవ్యాప్తంగా సైన్స్, ఆర్ట్స్ ఎంచుకున్న విద్యార్థులు 2012లో 31 శాతం ఉండగా (రెండింటికీ కలిపి), 2022 నాటికి సైన్సులో 42 శాతానికి, ఆర్ట్స్‌లో 40 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది. ఇంటర్లో 2012లో 30.9 లక్షల మంది విద్యార్థులు ఆర్ట్స్ స్ట్రీమ్‌ను తీసుకున్నారు. 2022లో ఈ సంఖ్య 40 లక్షలకు చేరుకుంది. సైన్స్ స్ట్రీమ్‌లో 2012లో 30.7 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2022లో వీరి సంఖ్య 42 లక్షలకు పెరిగింది. అదే కామర్స్ స్ట్రీమ్‌లో 2012లో 13.7 లక్షల మంది విద్యార్థులు ఉండగా 2022కి వారి సంఖ్య నామమాత్రంగానే పెరిగింది. ఇప్పుడు కామర్స్ విద్యార్థులు 14.4 లక్షల మంది ఉన్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నందున ఆ స్ట్రీమ్‌లో చేరికలు

మిగతా 2వ పేజీలో ▶

సాగుకు వేళాయె!

- ఖరీఫ్–2023 సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలు
- గత ఖరీఫ్‌లో 79.53 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 6.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలు.. జోరుగా పంపిణీ
- 17.44 లక్షల టన్నుల ఎరువులు సిద్ధం.. రైతులకు రూ.1.13 లక్షల కోట్ల రుణాలు



సాక్షి, అమరావతి: మృగశిర కార్తె మొదలవడంతో రైతులు తొలకరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. పెట్టుబడికి ఢోకా లేకుండా వైఎస్సార్ రైతు భరోసా తొలివిడత సాయాన్ని రైతులకు ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. ఓ వైపు నైరుతి రుతు పవనాలు కమ్ముకొస్తుండగా.. గోదావరి, కృష్ణా డెల్టాల పరిధిలో కాలువలకు ఇప్పటికే నీరు విడుదల చేశారు. మిగిలిన ప్రాంతాలకు దశల వారీగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబీ కోతలు పూర్తయిన ప్రాంతాల్లో వేసవి దుక్కుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్–2023లో సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలుగా నిర్దేశించారు. ప్రధానంగా 39.70 లక్షల ఎకరాల్లో వరి, 17.25 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 15.45 లక్షల ఎకరాల్లో పత్తి, 6.30 లక్షల ఎకరాల్లో కందులు, 1.62 లక్షల ఎకరాల్లో చెరకు, 3.12 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

జోరుగా విత్తన పంపిణీ

ఖరీఫ్–2023 కోసం 6.14 లక్షల క్వింటాళ్ల

మిగతా 2వ పేజీలో ▶

రెండో ఎంఈవో పోస్టు భర్తీకి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: విద్యాశాఖను మరింత పటిష్టం చేయడంలో భాగంగా పాఠశాలల పర్యవేక్షణ కోసం మండల విద్యాధికారి–2 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎంఈవోలు, గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులతో ఈ పోస్టులను భర్తీ చేయనుంది. ఈమేరకు బుధవారం విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 670 మండలాలు ఉన్నాయి. వీటన్నిటికీ కొత్తగా రెండో ఎంఈవో రానున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల ఆసక్తి, సీనియారిటీ ఆధారంగా ఎంఈవో–2 పోస్టుల్లో నియమించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, మండల విద్యాశాఖ అధికారి–2 పోస్టులను భర్తీ చేయడానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, జాక్టో చైర్మన్ కేశవరపు జాలిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పోలవరం ముంపు జాబితాలోకి
మరో 14 గ్రామాలు

- ఈ ఏడాది మార్చిలో 17 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చిన ప్రభుత్వం
- తాజా నిర్ణయంతో 98కి చేరిన ముంపు గ్రామాల సంఖ్య



చింతూరు: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల జాబితాలో ఏఎస్ఆర్ జిల్లాలోని మరో 14 గ్రామాలు చేరాయి. ఈ ఏడాది మార్చిలో పోలవరం ముంపు మండలాలైన ఏఎస్ఆర్ జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురంలో 17 గ్రామాలను చేర్చగా.. తాజాగా ఈ మూడు మండలాల్లో మరో 14 గ్రామాలను చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022లో వచ్చిన గోదావరి వరదల ముంపును ప్రామాణికంగా తీసుకుని ముంపు గ్రామాల జాబితాలో అదనపు గ్రామాలను చేర్చారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పోలవరం ఆర్ అండ్ ఆర్, రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు.


98కి చేరిన ముంపు గ్రామాల సంఖ్య

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 (తొలిదశ) కాంటూరు పరిధిలో 67 గ్రామాలు ముంపు బారిన పడతాయని లెక్కతేల్చారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తిచేశారు. కాగా గతేడాది సంభవించిన వరదలకు పోలవరం ముంపుతో సంబంధం లేకుండా చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో తమ గ్రామాలను తొలిదశలో కలిపి

మిగతా 2వ పేజీలో ▶

గతానికి మించి
భానుడి భగభగలు

- గతంలో కొన్ని ప్రాంతాల్లో.. కొన్ని గంటలు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలు
- ఈ ఏడాది దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ.. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు తీవ్రత
- ఎండలు పెరిగినా తగ్గిన వడదెబ్బ మరణాలు
- 2017లో 236 మంది మృతులు
- ఈ ఏడాది ముగ్గురు
- ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసిన విపత్తు నిర్వహణ సంస్థ



సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రాష్ట్రంలో ఎండలు తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నాయి. ఏదో ఒక్క చోట కాకుండా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నా తక్కువ ప్రాంతాల్లోనే అవి ఉండేవి. అలాగే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే తీవ్రత ఉండేది. అయితే ఈ ఏడాది మెజారిటీ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతేకాకుండా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలకు సైతం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీన్నిబట్టి ఈ ఏడాది ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనా 44 డిగ్రీలున్నట్టు ఉంటోందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. అలాగే 45 డిగ్రీలు నమోదైతే 49 డిగ్రీలున్నట్టు అనిపిస్తోందని అంటున్నారు. గాలిలో తేమ శాతం అసలు లేకపోవడమే దీనికి కారణం. అందులోనూ అన్ని జిల్లాల్లోనూ సగటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో గతంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలకు, ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతలకి పోలికే లేదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏరకంగా చూసినా ఈ సంవత్సరం నమోదైన ఉష్ణోగ్రతలు రికార్డులను బ్రేక్ చేసినట్లేనని అంచనా వేస్తున్నారు.

నైరుతి వచ్చినా.. 44 డిగ్రీలకుపైనే ఎండలు

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమవడం, వాటి మందగమనం వల్ల రాష్ట్రంలో ఇంకా 44 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒకప్పుడు మండే ఎండలంటే 35–36 డిగ్రీలు ఉండేవి. అది కూడా మేలో మాత్రమే నమోదయ్యేవి. కానీ ఇప్పుడు 40 డిగ్రీల ఎండ సాధారణంగా మారిపోయింది. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరగడమే దీనికి ప్రధాన కారణం. ఈ ఏడాది భానుడి భగభగలు ఫిబ్రవరి నుంచే ప్రారంభమయ్యాయి. ఆ నెల చివరి వారంలోనే కర్నూలు జిల్లా కౌతాళంలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2022లో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదవగా.. ఈ ఏడాది తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 46.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గుండ్లపల్లిలో 46.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. నెలల వారీగా చూసినప్పుడు మార్చిలో నంద్యాల జిల్లా నందికొట్కూరు, వైఎస్సార్ జిల్లా కడప మండలంలో 41.8, ఏప్రిల్‌లో పల్నాడు జిల్లా బెల్లంకొండలో 45.9, మేలో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 46.8, జూన్‌లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో 45.6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండలు పెరిగినా తగ్గిన వడదెబ్బ మృతులు

ఎండలు పెరిగినా ఈ ఏడాది వడదెబ్బ మృతుల సంఖ్య చాలా తగ్గింది. 2016లో వడదెబ్బకు 723 మృతి చెందారు. 2017లో 236, 2018లో 8, 2019లో 28 మంది మరణించారు. 2020, 21, 22ల్లో వడగాడ్పుల మరణాలు అసలు సంభవించలేదు. ఈ ఏడాది తీవ్ర ఎండలు, వడగాడ్పులున్నా ప్రాణనష్టం ముగ్గురికి పరిమితమైంది.

ప్రాణనష్టాన్ని తగ్గించాం..

వాతావరణ శాఖ అంచనాల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి చర్యలు తీసుకుని ప్రాణనష్టాన్ని తగ్గించగలిగాం. ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు వీచే జిల్లాల యంత్రాంగానికి 48 గంటల ముందే సూచనలు అందించాం. క్షేత్రస్థాయిలో ప్రజలకు జాగ్రత్తలు, హెచ్చరిక సందేశాలు పంపి నిరంతరం అప్రమత్తం చేశాం. రియల్‌టైమ్‌లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తూ.. 40 డిగ్రీలు దాటే మండలాల తహసీల్దార్లకు ముందుగానే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాం. సంబంధిత మండలంలో అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించాం.

– బీఆర్ అంబేడ్కర్, ఎండీ, విపత్తుల నిర్వహణ సంస్థ



పాపికొండల అభయారణ్యంలో కెమెరాకు చిక్కిన బంగారు బల్లి

పోలవరం అడవిలో
బంగారు బల్లి

- సూర్యరశ్మి తగలని ప్రదేశాల్లో నివసించే జీవి
- ఒకేసారి 40 నుంచి 150 గుడ్లు పెట్టే ప్రాణి

బుట్టాయగూడెం: అరుదైన జాతికి చెందని బంగారు బల్లి అంతరించిపోతున్న జీవుల్లో ముఖ్యమైనది. ఇప్పుడివి పోలవరం అడవిగా పిలిచే పాపికొండలు అభయారణ్యంలోని కొండ గుహల్లో సందడి చేస్తున్నాయి. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టిలోడస్ అరీస్. సాధారణంగా ఇవి రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు..

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

డీఎస్సీ-1998 ఉపాధ్యాయుల పునర్నియామకం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికపై నియమితులైన డీఎస్సీ-1998 టీచర్ల సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. 2023-24 విద్యా సంవత్సరంలో వీరు సేవలు అందించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు వీరు విధుల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: రక్తదానాన్ని ప్రోత్సహించడం అత్యంత ప్రాధాన్యత అంశంగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణిస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. తలసేమియా బాధితులకు తగినన్ని యూనిట్ల రక్తం సరఫరాకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్రంలోని 21 బ్లడ్ బ్యాంకుల ద్వారా ఏటా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరిస్తుండడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం ఆవశ్యకతను అందరూ మరోసారి మననం చేసుకోవాలని ఆయన పేర్కొన్నట్లు రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

6,829 యూనిట్ల రక్తం సేకరణ

- ఏపీ శ్యాక్స్ పీడీ నివాస్



సాక్షి, అమరావతి: 'వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే'ను పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ శ్యాక్స్ (ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) ఆధ్వర్యంలో బ్లడ్ క్యాంపులు నిర్వహించినట్లు పీడీ జె.నివాస్ తెలిపారు. ఈ క్యాంపులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 201 క్యాంపులు నిర్వహించగా 6,829 యూనిట్ల రక్తాన్ని సేకరించామని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 887 యూనిట్లు సేకరించినట్లు వెల్లడించారు. అదే విధంగా ప్రజల్లో రక్తదానంపై అవగాహన పెంచడం కోసం ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలు, వైద్య, వివిధ శాఖల అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించినట్లు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూనే ఉన్నాం

- సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ మొదట నుంచీ పోరాడుతూనే ఉందని, ఆ పార్టీతో తామెప్పుడూ కలిసిలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తామేమీ ఇప్పుడు కొత్తగా మాట్లాడడం లేదని అలాగే ముఖ్యమంత్రి జగన్‌ను భాజపా ఎప్పుడూ సమర్థించలేదని చెప్పారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంపై యువమోర్చా ఉద్యమం చేపడితే కేంద్రమంత్రి అనురాగ్‌ఠాగూర్ వచ్చి వైకాపా మద్యం మాఫియాపై తీవ్ర విమర్శలు చేశారని గుర్తుచేశారు.

విరామం ముగిసింది.. వేట మొదలైంది!



ముగిసిన నిషేధ కాలం.. లంగరెత్తిన మత్స్యకారులు

- మత్స్యకార గ్రామాల్లో పండుగ వాతావరణం
- వరుసగా ఐదో ఏడాదీ 'నిషేధ' సమయంలోనే భృతి చెల్లింపు
- డీజిల్ సబ్సిడీ పెంపుతో 29,964 కు చేరిన బోట్ల సంఖ్య

సాక్షి, అమరావతి: గంగపుత్రుల వేటకు వేళైంది. రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో చేపల వేటకు వెళుతున్నారు. దీంతో మత్స్యకార గ్రామాల్లో పండుగ వాతావరణం, హార్బర్ల వద్ద సందడి నెలకొంది. బోట్లకు రంగులు వేసి అలంకరించారు. వలలకు మరమ్మతులు చేసుకున్నారు. కనీసం పది రోజులకు సరిపడా డీజిల్ ఆయిల్ నింపుకోవడంతో పాటు.. మత్స్య సంపదను నిల్వచేసుకునేందుకు వీలుగా ఐస్‌ను సిద్ధం చేసుకుని రెట్టించిన ఉత్సాహంతో గంగపుత్రులు వేటకు బయల్దేరారు.

మత్స్య దిగుమతులు పైపైకి..

బోట్ల సంఖ్య పెరగడంతో వలకు చిక్కే సముద్ర మత్స్య ఉత్పత్తులూ ఏటా పెరుగుతున్నాయి. 2019-20లో 4.40 లక్షల టన్నుల చేపలు, 1.24 లక్షల టన్నుల రొయ్యలు మత్స్యకార వలలకు చిక్కాయి. 2020-21లో 4.60 లక్షల టన్నుల చేపలు, 1.34 లక్షల టన్నుల రొయ్యలు, 2021-22లో 4.60 లక్షల టన్నుల చేపలు, 1.35 లక్షల టన్నుల రొయ్యలు, 2022-23లో సముద్ర చేపలు 4.68 లక్షల టన్నులు, సముద్ర రొయ్యలు 1.35 లక్షల టన్నులు, 2023-24లో సముద్ర చేపలు 4.75 లక్షల టన్నులు, రొయ్యలు 1.36 లక్షల టన్నులు మత్స్యకారులకు చిక్కాయి. ఫలితంగా సముద్ర చేపల ఉత్పత్తిలో ఏపీ మూడో స్థానంలో నిలిచింది.

భద్రంగా భృతి.. ఎప్పటికప్పుడు సబ్సిడీ

చేపల పునరుత్పత్తి కోసం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసింది. తడ మొదలుకుని ఇచ్ఛాపురం వరకు 974 కి.మీ. మేర విస్తరించిన సముద్ర తీరంలో 555 మత్స్యకార గ్రామాల్లో 8.50 లక్షల మంది మత్స్యకార కుటుంబాలున్నాయి. వారిలో 1.60 లక్షల కుటుంబాలు వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. నిషేధ సమయంలో గతంలో రూ.2 వేలు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసరాలు నిలిపేసి రూ.4 వేల చొప్పున భృతి ఇచ్చేవారు. అదీ వేట నిషేధం ముగిసిన ఆర్నెల్లకో ఏడాదికో అరకొరగా.. తమకు అనుకూలంగా ఉన్న వారికే ఇచ్చేవారు. ఇలా టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రూ.104.62 కోట్ల వేట నిషేధ భృతి అందించింది. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచడమే కాకుండా.. ఆ మొత్తాన్ని నిషేధ కాలం ముగిసేలోపే అందిస్తోంది. గత నెల 16న 1.23 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.123.52 కోట్ల మేర వైఎస్సార్ మత్స్యకార భృతిని అందజేశారు. ఇలా నాలుగేళ్లలో రూ.538 కోట్లు అందించారు. అలాగే గతంలో డీజిల్‌పై లీటర్‌కు రూ.6.03 సబ్సిడీ ఇచ్చేవారు. టీడీపీ హయాంలో తొలి మూడేళ్లు ఏటా కేవలం 460 బోట్లకు, ఆ తర్వాత రెండేళ్లు 1,100 బోట్లకు సబ్సిడీ ఇచ్చారు. ఐదేళ్లలో రూ.60.12 కోట్ల లబ్ధిచేకూర్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సబ్సిడీ మొత్తాన్ని రూ.9కి పెంచడమే కాకుండా.. తొలిసారి తెప్పలు, నావలకూ వర్తింపజేసింది. ఆయిల్ పోయించుకునేటప్పుడే సబ్సిడీ మినహాయించుకుని చెల్లించేలా మత్స్యకారులకు స్మార్ట్ కార్డులిచ్చారు. ఇలా నాలుగేళ్లలో రూ.100 కోట్లకు పైగా సబ్సిడీని ప్రభుత్వం భరించింది. సబ్సిడీ పెంపుతో వేటకు వెళ్లే బోట్ల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2019-20లో 14,229 బోట్లు వేటకు వెళ్లగా, ప్రస్తుతం 29,964 బోట్లు వేటకు వెళుతున్నాయి.

సాగుకు వేళాయె!

▶ మొదటి పేజీ తరువాయి

సబ్సిడీ విత్తనాలతో పాటు గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వాణిజ్య పంటలైన పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు కూరగాయల విత్తనాల (నాన్ సబ్సిడీ)ను కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు సరఫరా చేయనున్నారు. ఇప్పటివరకు 2.24 లక్షల క్వింటాళ్ల విత్తనం కోసం 3.52 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో వివరాలను నమోదు చేసుకున్నారు. 13వేల మందికి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయగా.. 18,835 మందికి వేరుశనగ విత్తనం పంపిణీ చేశారు. మిగిలిన విత్తనాలను ఆర్బీకేల్లో నిల్వ చేశారు. అలాగే 7,687 క్వింటాళ్ల పత్తి విత్తనం (35.75 లక్షల ప్యాకెట్లు) అవసరం కాగా, దాంట్లో 1,921 క్వింటాళ్ల విత్తనం (8.94 లక్షల ప్యాకెట్లు) ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 5,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 356 క్వింటాళ్ల జొన్న, 62 క్వింటాళ్ల సన్‌ఫ్లవర్, 290 టన్నుల సజ్జ విత్తనాలను కూడా ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టగా, ఇప్పటికే 20,077 శాంపిల్స్ సేకరించారు. 13 వేల శాంపిల్స్‌ను విశ్లేషించగలిగారు.

ఆర్బీకేల ద్వారానే 10 లక్షల టన్నుల ఎరువులు

ప్రస్తుత సీజన్‌కు 17.43 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా.. ఇప్పటికే 9.04 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచింది. మరోవైపు 4 లక్షల లీటర్లు నానో యూరియాతో పాటు 6.25 లక్షల లీటర్ల నానో డీఏపీ బాటిల్స్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడేళ్లలో ఆర్బీకేల ద్వారా 8.75 లక్షల టన్నుల ఎరువులను సరఫరా చేయగా.. ప్రస్తుత సీజన్‌లోనే 10 లక్షల టన్నులు సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ కోసం 1,600 టన్నుల పురుగుల మందులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.1.13 లక్షల కోట్ల రుణాలు

2023-24 సీజన్‌లో రైతులకు రూ.1.92 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రూ.1.13 లక్షల కోట్లు ఇవ్వనున్నారు. దాంట్లో పంట రుణాలు రూ.80 వేల కోట్లు, టర్మ్ రుణాలు రూ.33 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యం కాగా.. ఇప్పటికే రూ.11.946 కోట్ల రుణాలు ఇచ్చారు. కౌలు రైతులకు రూ.4 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రైతుకు అండగా నిలుస్తాం

విత్తు నుంచి కోత వరకు రైతులకు అండగా నిలిచేలా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. విత్తన పంపిణీ జోరుగా సాగుతోంది. ఎరువులతోపాటు నానో యూరియా, నానో డీఏపీని కూడా ఈసారి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. గ్యాప్ సర్టిఫికేషన్ కోసం ఎంపిక చేసిన క్లస్టర్స్ పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వెయ్యి పొలంబడులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– చేవూరి హరికిరణ్,
స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

రాష్ట్రంలో తొలి మహిళా సహకార డెయిరీ ప్రారంభం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఏర్పాటు
- 'అమ్మ డెయిరీ'ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డెయిరీని ప్రారంభిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్ తదితరులు

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్‌లో తొలి 'మహిళా సహకార డెయిరీ' అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఏర్పాటైంది. స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులు రూ.20 కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలోని 10 వేల మంది మహిళా పాడి రైతుల కోసం ఈ డెయిరీ ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన నిర్మించిన ఈ డెయిరీకి 'అమ్మ డెయిరీ'గా నామకరణం చేశారు. ఈ డెయిరీని బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. దీనివల్ల ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ప్రారంభంలో రోజూ లక్ష లీటర్ల పాలను సేకరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులేనని స్పష్టం చేశారు.మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు స్పెషల్ పే పెంపు

- జూలై 1 నుంచి అమల్లోకి
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 11వ వేతన సవరణ సిఫార్సులకు అనుగుణంగా పెంపు
- హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు

సాక్షి, అమరావతి: వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ పే పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 11వ వేతన సవరణ సిఫార్సుల మేరకు స్పెషల్ పేను గరిష్టంగా 33 శాతం వరకు పెంచింది. 11వ వేతన సవరణ సిఫార్సులకు అనుగుణంగా స్పెషల్ పే ఏ మేరకు పెంచాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి దానికి అనుగుణంగా వివిధ కేటగిరీలకు స్పెషల్ పే పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సవరించిన ప్రత్యేక వేతనాలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల్లో కొంతమందికి ప్రస్తుతం రూ.675 ఉన్న స్పెషల్‌పే రూ.900కి పెరిగితే, మరికొందరికి రూ.260 ఉన్న స్పెషల్ పే రూ.350కి పెరిగింది. డిపార్ట్‌మెంటు, హోదాల వారీగా ఎవరికి ఎంత స్పెషల్ పే పెరిగిందన్న విషయాన్ని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ప్రభుత్వం ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ చర్చల్లో ఇచ్చిన హామీమేరకు వివిధ కేటగిరీల ఉద్యోగులకు స్పెషల్ పే పెంచడంపై ఉద్యోగసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఉద్యోగుల స్పెషల్ పేకి సంబంధించి 11వ వేతన సిఫార్సులను యథాతథంగా అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దీనివల్ల ఒకటి రెండు కేటగిరీల ఉద్యోగులకు తప్ప మిగతా కేటగిరీల వారందరికీ స్పెషల్ పే 30 నుంచి 33 శాతం పెరుగుతుందని పేర్కొన్నారు.

పోలవరం ముంపు జాబితాలోకి మరో 14 గ్రామాలు

▶ మొదటి పేజీ తరువాయి

నష్టపరిహారం ఇవ్వాలని ముంపుప్రాంతాల ప్రజలు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. వరద ముంపును దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యత క్రమంలో కొన్ని గ్రామాలను ముంపు జాబితాలో చేర్చాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దీంతోపాటు గతేడాది వరద ముంపును స్వయంగా పరిశీలించిన జిల్లా అధికారులు వరద ప్రాంతాల పర్యటనకు చింతూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పరిస్థితిని వివరించారు. దీనిపై అధ్యయనం చేసిన అధికారులు ఎట్టకేలకు గతంలో 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురవుతున్న 67 గ్రామాలకు అదనంగా ఈ ఏడాది మార్చిలో మరో 17 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చారు. తాజాగా వాటికి తోడు మరో 14 గ్రామాలను కూడా చేర్చారు. దీంతో ప్రాధాన్యత గ్రామాల సంఖ్య 31కు చేరగా.. తొలి దశలోని 67 గ్రామాలతో కలుపుకుని ముంపు గ్రామాల సంఖ్య 98కి చేరింది. కొత్తగా చేర్చిన వాటిలో వీఆర్ పురం మండలంలో కన్నాయిగూడెం, కొప్పలి, శబరిరాయిగూడెం, సోములగూడెం, రామవరం, చొప్పల్లి, చింతూరు మండలంలో మల్లెతోట, ఉలుమూరు, ఏజీ కోడేరు, చూటూరు, మార్కండేయులపేట, కూనవరం మండలంలో లేళ్లవాయి, కూళ్లపాడు, వాల్ఫ్రెడ్‌పేట గ్రామాలున్నాయి.

నూరుశాతం జనన, మరణాలు నమోదు కావాలి

- పంచాయతీలు, మున్సిపాలిటీలకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూరుశాతం జనన, మరణాల నమోదు (రిజిస్ట్రేషన్) జరిగేలా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. ఆధార్ అనుసంధానిత జనన, మరణ ధ్రువీకరణ అంశంపై ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి రానున్న రోజుల్లో ఆధార్ అనుసంధానిత జనన, మరణ ధ్రువీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి త్వరలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నూరుశాతం జనన, మరణాల నమోదుకు సంబంధించి పంచాయతీలు, మున్సిపాలిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. వచ్చే సమావేశంలో పలు అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించి కార్యాచరణ అమలుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, సీడీఎంఏ కోటేశ్వరరావు తదితరులు ప్రత్యక్షంగా, యుఐడీఏఐ అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

సైన్సు, ఆర్ట్స్‌కే ప్రాధాన్యం

▶ మొదటి పేజీ తరువాయి

పెరగడం సహజం. అయితే కామర్స్ కన్నా ఆర్ట్స్‌లో చేరికలు ఎక్కువగా ఉన్నాయి. వాణిజ్య రంగంలో ఉద్యోగావకాశాలు అంతగా లేకపోవడమే ఇందుకు కారణం అయ్యుంటుంది' అని ఆ నివేదిక విశ్లేషించింది.

ఏపీ, తెలంగాణ, తమిళనాడుల్లో సైన్స్‌కే ఆదరణ

ఈ అధ్యయనం ప్రకారం గత 10 సంవత్సరాలలో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులో ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ వైపు మొగ్గు చూపారు. ఏటా ఆంధ్రప్రదేశ్‌లో 76 శాతం, తెలంగాణలో 65 శాతం, తమిళనాడులో 62 శాతం విద్యార్థులు సైన్స్ స్ట్రీమ్‌లో చేరుతున్నారు. ఇక గుజరాత్ (82 శాతం), పంజాబ్ (73 శాతం), రాజస్థాన్ (71 శాతం)లలో విద్యార్థులు ఆర్ట్స్ స్ట్రీమ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. అయితే, కర్ణాటకలో మాత్రం 37 శాతం మంది కామర్స్ స్ట్రీమ్‌ను ఎంచుకున్నారు.

ఉత్తీర్ణత శాతాలూ భారీగా పెరుగుదల

ఇలా ఉండగా గత దశాబ్దంలో 10, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. 10వ తరగతిలో 60 శాతానికి పైగా మార్కులు సాధించిన వారి శాతం 2012లో 33 లక్షల నుంచి 2022లో 98 లక్షలకు చేరుకోవడం విశేషం. 12వ తరగతిలో 60 శాతానికి పైగా స్కోర్ చేసిన విద్యార్థులు 2012లో 35.9 లక్షల మంది ఉండగా 2022 నాటికి వారి సంఖ్య 77 లక్షలకు చేరుకుంది. ఇంటర్లో ఉత్తీర్ణత శాతం గతంలో 60 నుంచి 65 శాతం లోపే ఉండగా అదిప్పుడు 90 శాతానికి పైగా చేరిందని నివేదిక విశ్లేషించింది. 10, 12 తరగతుల్లో బాలురకన్నా బాలికలు ఎక్కువగా రాణిస్తున్నారు. బాలురకన్నా బాలికల ఉత్తీర్ణత 8 శాతం ఎక్కువగా ఉంది.

11 రాష్ట్రాల్లో డ్రాపవుట్ సమస్య

టెన్త్ తరువాత ఇంటర్మీడియెట్ తరగతుల్లో చేరకుండా డ్రాపవుట్ అవుతున్న వారి సంఖ్య 11 రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర నివేదిక వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, అసోం, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డ్రాపవుట్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది.

పోలవరం అడవిలో బంగారు బల్లి

▶ మొదటి పేజీ తరువాయి

లేత పసుపు రంగులో 150 మిల్లీమీటర్ల నుంచి 180 మిల్లీమీటర్ల పొడవు ఉంటాయి. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో మాత్రమే సంచరిస్తాయి. రాతి గుహలు, వాటి సందు మధ్య ఉండే తేమ ప్రాంతాలంటే బంగారు బల్లులకు మహా ఇష్టం.

40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయి

ఇవి ఒకేసారి సుమారు 40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయి. ఇవి గుడ్లను విచిత్రంగా కిందకి వేలాడే విధంగా పెడతాయి. ఈ గుడ్లను పాములు, క్రిమికీటకాలు తినేస్తుండటంతో ఇవి అంతరించిపోయే జాతుల్లోకి చేరుతున్నాయని అంటున్నారు. పాపికొండలు అభయారణ్య గోదావరి పరీవాహక రాతి ప్రాంతాల్లో సుమారు 250 వరకు బంగారు బల్లులు ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు అంచనా వేశారు. బంగారు బల్లుల్లోనూ రెండు జాతులుగా ఉన్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. వాటిలో ఒకటి కాలోడాక్టి లోడస్ అరీస్. ఇవి సాధారణ బల్లుల కంటే పెద్దగా అరుస్తూ వింత శబ్దం చేస్తాయని చెబుతున్నారు.




పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల సంచారం ఉంది



పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల జాడ ఉంది. రెండేళ్ల క్రితం నేను, విశాఖపట్నానికి చెందిన శాస్త్రవేత్త కలిసి పోలవరం మండలం సిరివాక గ్రామంలోని గోదావరి సమీపంలో గల రాతి ప్రదేశాల్లో అధిక సంఖ్యలో బంగారు బల్లులు పెట్టిన గుడ్లు గుర్తించాం. 250కి పైగా బంగారు బల్లులు ఉండవచ్చని అంచనా వేస్తున్నాం.

– దావీదురాజు నాయుడు,
ఇన్‌చార్జి ఫారెస్ట్ అధికారి, పోలవరం

ఫొటోలు తీశా



పాపికొండలు అభయారణ్యంలో అరుదైన పక్షులను, జంతువులను ఫొటోలు తీశాను. బంగారు బల్లి కూడా నా కెమెరాకు చిక్కింది. అభయారణ్యం రాతి ప్రాంతాల్లో ఈ బల్లుల సంచారం ఉంది. శాస్త్రవేత్తలు కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు.

– కె.బాలాజీ,
ఫొటోగ్రాఫర్, రాజమండ్రి

చెట్ల కూల్చివేతను తీవ్రంగా పరిగణిస్తాం..

- ఏయూలో చెట్ల కూల్చివేతపై పూర్తి వివరాలివ్వండి : హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ) పరిధిలో చెట్ల కూల్చివేతలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల కూల్చివేతలను తీవ్రంగా పరిగణిస్తామంది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని ఏయూ తరపు న్యాయవాది వి.సాయి కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెట్లను కూల్చివేస్తున్నారని, ఇందుకు సంబంధించి అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఇది వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే విచారణ జరిపిన ధర్మాసనం, తదుపరి చెట్ల కూల్చివేతలు చేపట్టవద్దని వర్సిటీ అధికారులను ఆదేశించింది. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యంపై ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి కుంటలను పూడ్చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించారన్నారు. ఏయూ తరపు న్యాయవాది సాయికుమార్ స్పందిస్తూ చిన్న చిన్న పొదలను తొలగించామే తప్ప చెట్లను కూల్చివేయలేదన్నారు. చెట్ల కూల్చివేత విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలంటూ విచారణను 28కి వాయిదా వేసింది.

నాలుగో పోర్టుతో మహర్దశ

▶ మొదటి పేజీ తరువాయి

అన్నిరకాల ఎగుమతులు, దిగుమతులకు వీలుగా ఉంది. అయితే భౌగోళికంగా ఈ పోర్టు విస్తరణకు వీలు కాకపోవడంతో సుమారు 30 కి.మీ దూరంలో మరో పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. తొండంగి మండలం పెరుమాళ్లపురం వద్ద సుమారు 1,944 ఎకరాల్లో కాకినాడ సెజ్ గేట్‌వే పోర్టు (కేసెజ్ పోర్టు) ఏర్పాటవుతోంది. నాలుగు నెలల క్రితం మొదలైన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. సౌత్ బ్రేక్ వాటర్ మొత్తం 3,000 మీటర్లలో నిర్మిస్తుండగా ఇప్పటికే 1,000 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. నార్త్ బ్రేక్ వాటర్ పనులు కూడా ఇటీవలే మొదలయ్యాయి. అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రెడ్జింగ్, భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తొలిదశలో మూడు బెర్తుల ద్వారా ఏటా 16 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. పీపీపీ విధానంలో ఏర్పాటవుతున్న ఈ పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైన నాటి నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయంలో 2.70 శాతం వాటా ఏపీ మారిటైమ్ బోర్డుకు సమకూరనుంది. 31-40 ఏళ్ల వరకు 5.40 శాతం, 41-50 ఏళ్ల వరకు 10.80 శాతం వాటా దక్కుతుంది.

రూ.1,800 కోట్లతో రహదారులు, రైల్వే లైన్

కాకినాడ, కేసెజ్ పోర్టును అన్నవరం వద్ద జాతీయ రహదారికి అనుసంధానిస్తూ సుమారు 40 కి.మీ పొడవైన నాలుగు లైన్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు. సాగర్‌మాల ప్రాజెక్టు కింద ఈ రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అన్నవరం రైల్వే స్టేషన్‌ను కేసెజ్ పోర్టుకు అనుసంధానిస్తూ 25 కి.మీ రైల్వే లైన్‌ను రూ.300 కోట్లతో చేపట్టనున్నారు. 20 కల్వర్టులు, రెండు బ్రిడ్జిలను నిర్మించనున్నారు. అన్నవరం రైల్వే స్టేషన్‌ను రూ.40 కోట్లతో ఆధునీకరించనున్నారు. కాకినాడ సెజ్‌లో పెట్రో కెమికల్స్, స్టీల్, సీఫుడ్స్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ పోర్టు ద్వారా ప్రత్యక్షంగా 3,000 మందికి పరోక్షంగా 10,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. పోర్టు లావాదేవీలు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర జీడీపీ పెరగనుంది. తద్వారా రాష్ట్ర ఆదాయం, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు.

కాకినాడ సెజ్ పోర్టు ఇలా

విస్తీర్ణం	1,944 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం	రూ.2,123.43 కోట్లు
పోర్టు వార్షిక సామర్థ్యం	16 మిలియన్ టన్నులు
బెర్తులు	3 (కోల్ 1, మల్టీ పర్పస్ 2)
సౌత్ బ్రేక్ వాటర్	3,000 మీటర్లు
నార్త్ బ్రేక్ వాటర్	850 మీటర్లు
నౌక గరిష్ట సామర్థ్యం	1,20,000 డీడబ్ల్యూటీ

నష్టపరిహారం చెల్లించారు

పోర్టు ఏర్పాటుతో మా గ్రామం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాం. పోర్టు పనులు మొదలయ్యాక చేపలు పట్టేందుకు అవకాశం లేకపోవడంతో కేసెజ్ నుంచి నష్టపరిహారం అందింది. మా గ్రామంలో తెల్లరేషన్ కార్డున్న ప్రతి మత్స్యకారుడికి రూ.1.50 లక్షల నష్టపరిహారంతో పాటు బోటు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా చెల్లించారు. సుమారు 1,350 మందికి నష్ట పరిహారం ఇచ్చారు.

– పి.వెంకటేశ్వర్లు,
చింతకాయలపేట.

24 నెలల్లో అందుబాటులోకి

తొలి దశ పోర్టును 24 నెలల్లో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటికే సౌత్ బ్రేక్ వాటర్ పనులు 1000 మీటర్లు పూర్తికాగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు ప్రారంభించాం. మూడు బెర్తులతో ఏటా 16 మిలియన్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మిస్తున్నాం. పెట్రో కెమికల్స్ కార్యకలాపాల కోసం ఎల్ఎన్‌జీ టెర్మినల్ నిర్మించనున్నాం. వర్షాకాలం తరువాత పోర్టును అనుసంధానించే రహదారి పనులను ప్రారంభిస్తాం. పోర్టు సిద్ధమయ్యేనాటికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. కేసెజ్‌లో ఫార్మా, పెట్రో కెమికల్స్, స్టీల్, ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో ఈ పోర్టుకు భారీ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నాం.

– గరుడ సీతారామయ్య,
వైస్ ప్రెసిడెంట్, కేసెజ్ లిమిటెడ్.

పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

సుదీర్ఘ తీరప్రాంతాన్ని వినియోగించుకుంటూ సముద్ర వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారు. సుమారు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను ఏకకాలంలో నిర్మిస్తున్నారు. పోర్టులను అనుకుని పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయడంతోపాటు ఫిషింగ్ హార్బర్ల వద్దే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్,
సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు.

సాక్షి అనంతపురం

గురువారం । 15 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,000 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



నేటి నుంచి విత్తుకు అదను

ఖరీఫ్ పంటల సాగుకు గురువారం నుంచి వాతావరణం అనుకూలంగా ఉందని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

4లో

గరిష్టం/కనిష్టం 40.5°/23.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

బోధనాస్పత్రిని తనిఖీ చేసిన ఎన్‌ఎంసీ బృందం



రేడియాలజీ విభాగం హెచ్‌ఓడీ సురేష్‌తో మాట్లాడుతున్న డాక్టర్ జెర్నైల్‌సింగ్‌భవ

అనంతపురం క్రైం: ఫార్మకాలజీ విభాగానికి పీజీ సీట్ల పెంపు, రేడియాలజీ విభాగానికి పీజీ సీట్ల కేటాయింపు కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ప్రతినిధులు బుధవారం అనంతపురం బోధనాస్పత్రి(సర్వజనాస్పత్రి–వైద్యకళాశాల)ని తనిఖీ చేశారు. ఎన్‌ఎంసీ ప్రతినిధులు తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సీతామహాలక్ష్మి ఫార్మకాలజీ, మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ జెర్నైల్‌సింగ్‌భవ రేడియాలజీ విభాగాన్ని అణువణువూ పరిశీలించారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి ప్రొఫెసర్ డాక్టర్ జెర్నైల్‌సింగ్‌భవ మొదటగా ప్రభుత్వ వైద్య కళాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవితో సమావేశమయ్యారు. అనంతరం సర్వజనాస్పత్రిలో రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్‌తో కలసి ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే గదులను నిశితంగా పరిశీలించారు. రోజూ ఎంత మందికి సేవలందిస్తున్నారని టెక్నీషియన్లు నాగరాజు, ముకుంద, రాకేష్ తదితరులను ఆరా తీశారు. ప్రొఫెసర్ సీతామహాలక్ష్మి ఫార్మకాలజీ (ఔషధశాస్త్రం) విభాగాన్ని పరిశీలించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ఈ విభాగాల పీజీ సీట్లపై స్పష్టత వస్తుందని 'సాక్షి'కి తెలియజేశారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉండాలి

రాప్తాడురూరల్: అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో బోధనకు ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉపయోగించాలని డీఈఓ సాయిరామ్ స్పష్టం చేశారు. ఇతర ప్రైవేట్ పుస్తకాలను ఉపయోగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలకు తరగతి వారీగా, సబ్జెక్టువారీగా, మీడియం వారీగా అవసరమైన పాఠ్యపుస్తకాల ఇండెంట్‌ను cse.ap.gov.in పోర్టల్‌లో పాఠశాల లాగిన్‌తో నమోదు చేయాలని సూచించారు.

విధుల్లో అలసత్వం సహించను



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌కుమార్, కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని కలెక్టర్ గౌతమి హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి నుంచి వివిధ అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు 'జగనన్నకు చెబుదాం' జిల్లా ప్రత్యేక అధికారి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 'జగనన్నకు చెబుదాం' ద్వారా అందే ఫిర్యాదులను పారదర్శకంగా ప్రజల్లో సంతృప్తికరస్థాయి పెరిగేలా పరిష్కరించాలని ఆదేశించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలన్నారు. 'గడపగడపకూ మన ప్రభుత్వం' ద్వారా మంజూరైన పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశానికి నీటిపారుదల శాఖ అధికారులు గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జూలై 17న ఎస్కేయూ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం జూలై 17న నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూలో బుధవారం విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వీసీ మాట్లాడారు. సెమిస్టర్ పరీక్షలు తప్పనిసరిగా ఆగస్టు 16 నుంచి ప్రారంభం కావాలని ఆదేశించారు. జూలై 28 యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

మాటిచ్చి.. మేలు చేకూర్చి





'అమ్మ' డెయిరీ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు, 'అమ్మ' డెయిరీ వద్ద మహిళల సందడి

హామీ నెరవేర్చిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్నారు
- ఆయన కష్టం వృథాకాదు.. ప్రజలు అండగా నిలవాలి
- 'అమ్మ సహకార డెయిరీ' ప్రారంభోత్సవంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాప్తాడు రూరల్: రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రూ.20 కోట్ల తన సొంత నిధులతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన నిర్మించిన 'అమ్మ మహిళా సహకార డెయిరీ'ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మాట నిలబెట్టుకోవడం వెనుక ప్రకాష్‌రెడ్డి ఎంత కష్టపడ్డాడో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళా సహకార డెయిరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రైవేట్ డెయిరీల దోపిడీని అరికట్టేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డెయిరీని తీసుకొచ్చారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 25 ఏళ్లుగా మహిళలకు ఎవరూ చేయని మేలును ప్రకాష్‌రెడ్డి చేశారన్నారు. మీరు కూడా ఆయనకు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు.

'అమ్మ' డెయిరీ నలుమూలలా విస్తరించాలి..

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాటుపడుతున్నారు. మహిళలందరూ ఆయనకు అండగా ఉండాలని, 'అమ్మ డెయిరీ' పూర్తిస్థాయిలో విజయవంతమై జిల్లా నలుమూలలా విస్తరించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 'అమ్మ' డెయిరీ ఏర్పాటు ద్వారా రైతులకు మేలు జరగడంతో పాటు ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుతాయన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తం ఈ నాణ్యమైన 'అమ్మ' పాలనే వినియోగించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. టీడీపీకి ఘోర పరాభవం తప్పదని అన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రూ.20 కోట్లు ఖర్చు చేసి సహకార డెయిరీ ఏర్పాటు చేశారన్నారు. పాముకు పోసిన పాలు, మట్టిలో పోసిన పన్నీరు, చంద్రబాబు(టీడీపీ)కి వేసే ఓటు వృథా అవుతాయన్నారు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర చేసినా, లోకేష్ యువగళం పాదయాత్ర చేసినా, ముసలోడు (చంద్రబాబు) కాశీ యాత్ర చేసినా జగన్ జైత్రయాత్రను మాత్రం ఆపలేరని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, ఆయన స్ఫూర్తితో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నడుస్తూ 'అమ్మ' డెయిరీ నెలకొల్పారని అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ గతంలో రాప్తాడు నియోజకవర్గంలో కక్షలు, కార్పణ్యాలు ఉండేవని, ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మార్చేసి శాంతికుసుమాలు పూయించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మేయర్ వసీం, మాజీ మేయర్ రాగే పరుశురాం, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డితో పాటు డెయిరీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్, విప్ కాపు, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఆలూరి సాంబశివారెడ్డి



అమ్మ డెయిరీ ప్రారంభోత్సవ సభకు హాజరైన అక్కచెల్లెమ్మలు

10వేల మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి



తాను గెలిస్తే సహకార డెయిరీ ఏర్పాటు చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చా. ఆలమూరు వద్ద 'అమ్మ సహకార డెయిరీ'ని రూ.20 కోట్లతో ఏర్పాటు చేశాం. ఈ డెయిరీని 10 వేలమంది అక్క చెల్లెమ్మలకు అప్పచెబుతున్నాం. వారు నడిపే ఈ డెయిరీలో నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను, పాల ఉత్పత్తులను అందిస్తున్నాం. కొనుగోలుదారులు చెల్లించే ప్రతి రూపాయి 10 వేలమంది సభ్యులకు వెళ్తుంది. మధ్యలో ఎక్కడా దళారులు ఉండరు. పెట్టుబడుదారులు లేరు. కార్పొరేట్ కంపెనీలు అసలే లేవు. అమూల్ ఇస్తున్న ధరకంటే ఒకరూపాయి అదనంగా ఇస్తూ పాలను సేకరిస్తాం. జగనన్న ముఖ్యమంత్రి కాక ముందు మూడు శాతం వెన్న ఉన్న ఆవుపాలను లీటరు రూ.20తో కొనుగోలు చేసిన ప్రైవేట్ డెయిరీలు మార్కెట్‌లో మాత్రం రూ.46కు విక్రయించాయి. లీటరుపై రూ.26 లాభాలు పొందాయి. జగనన్న వచ్చిన తర్వాత ఈ దోపిడీని అరికట్టి రైతుకు, వినియోగదారులకు మేలు చేయాలనే ఉద్దేశంతో అమూల్ డెయిరీని తీసుకొచ్చారు. 'అమ్మ' డెయిరీలో మిగిలే సొమ్మంతా ఏడాదికోసారి వాటాలుగా వేసి 10 వేల మంది సభ్యులకు సమానంగా పంచుతాం. ఉమ్మడి జిల్లా అంతటా పాలను విక్రయిస్తాం. రోజుకు లక్ష లీటర్ల నుంచి రానున్న రోజుల్లో పది లక్షల లీటర్ల పాలను సేకరించి జిల్లాలోని రైతులందరికీ అండగా ఉంటాం. – తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఏపీ ఈఏపీసెట్‌లో 'అనంత' సత్తా

- ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు సాధించిన మాధవ్ భరద్వాజ్
- అగ్రికల్చర్ – ఫార్మసీ స్ట్రీమ్‌లో శ్రీవాత్సవరెడ్డికి 20వ ర్యాంకు
- టాప్–500 ర్యాంకుల్లో 10 మందికి చోటు

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్–2023లో 'అనంత' విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో అనంతపురానికి చెందిన ఎంఎల్‌ఎస్ మాధవ్ భరద్వాజ్ రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు దక్కించుకున్నాడు. అగ్రికల్చర్ – ఫార్మసీ స్ట్రీమ్‌లో జె.శ్రీవాత్సవరెడ్డి రాష్ట్ర స్థాయి 20వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో మొత్తం 11,361 మంది దరఖాస్తు చేసుకోగా, 10,916 మంది పరీక్షలు రాశారు. వీరిలో 7,944 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్ – ఫార్మసీ విభాగాల్లో మొత్తం 4,899 మంది దరఖాస్తు చేసుకోగా 4519 మంది పరీక్ష రాశారు. వీరందరూ అర్హత సాధించారు.



ఎంఎల్‌ఎస్ మాధవ్ భరద్వాజ్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఐఐటీ ముంబైలో బీటెక్ చదువుతా..



ఐఐటీ ముంబైలో బీటెక్ (కంప్యూటర్ సైన్సెస్) చదవడమే లక్ష్యం. బేసిక్స్ అంశాలపై పట్టు సాధిస్తేనే విజయం సులువు అవుతుంది. ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు దక్కడం ఆనందంగా ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందని భావిస్తున్నాను. ఏపీ ఈఏపీసెట్‌లో 153.144 మార్కులు వచ్చాయి. గణనీయమైన ర్యాంకు రావడానికి కారణం అమ్మా,నాన్న (హిమబిందు–సత్యనారాయణమూర్తి)ల ప్రోత్సాహమే.

– ఎంఎల్‌ఎస్ మాధవ్ భరద్వాజ్

అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్ టాపర్స్ వివరాలు			
విద్యార్థి పేరు	ర్యాంకు	మార్కులు	ప్రాంతం
ఎంఎల్‌ఎస్ మాధవ్ భరద్వాజ్	8	153.14	అనంతపురం
పొన్నతోట ప్రమోద్‌కుమార్‌రెడ్డి	28	148.74	తాడిపత్రి
సోదుం లేఖన	49	146.053	అనంతపురం
చిలమకూరి కుందన్‌సాయి	76	145.131	అనంతపురం
సూరం సాయి స్వప్నిత్‌కుమార్‌రెడ్డి	159	136.27	అనంతపురం
అంబటి రోచిష్ అభిరాం	217	131.97	అనంతపురం
భూపతి నిఖిల్ అగ్నిహోత్రి	325	126.52	అనంతపురం
నల్లపరెడ్డి యశోశ్రీకర్ ఆదిత్య రెడ్డి	396	122.003	అనంతపురం
పెల్లం మైత్రేష్ రెడ్డి	414	121.640	ధర్మవరం
మట్లూరి అరుణ్ సుజిత్	422	123.803	అనంతపురం
అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం టాపర్లు			
జెర్రిపోతుల శ్రీవాత్సవరెడ్డి	20	142.791	అనంతపురం
షేక్ ఫయాజ్ సబ్రీన్	30	140.364	కదిరి
గాంధీమనేని గిరి వర్షిత	44	137.980	అనంతపురం
కంబదూర్ విద్యా బోధిత	62	136.359	అనంతపురం
ధనకొండ చైతన్య	141	129.073	అనంతపురం
జాగృతి బోదెద్దుల	176	126.212	అనంతపురం
గొల్ల జయవర్ధన	198	126.706	తాడిపత్రి
కుమ్మర త్రివేది కుమార్	206	124.376	అనంతపురం
ఏఎస్ ప్రవీణ్	252	120.889	రాయదుర్గం
టి.తరుణ్	254	121.301	రాయదుర్గం

కంప్యూటర్ ఇంజినీర్ కావాలనే..



కంప్యూటర్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతోనే ఉన్నాను. ఏపీఈఏపీసెట్‌లో 146.0538 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 49వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. అమ్మ నవత, నాన్న సోదుం జగదీశ్వరరెడ్డితో పాటు మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి ప్రోత్సాహం మరువలేనిది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఆశిస్తున్నాను. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ .. ఐఐటీలో సీటు తెచ్చుకోవాలనే లక్ష్యంతో చేరలేదు.

– ఎస్.లేఖన, అనంతపురం

సివిల్స్‌లో రాణిస్తా...



ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో 28వ ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. నాన్న శ్రీనివాసులరెడ్డి పెద్దపప్పూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ అన్నపూర్ణ గృహిణి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈఏపీసెట్‌కు సన్నద్ధమయ్యాను. అనుకున్న విధంగా మంచి ర్యాంకు సాధించగలిగాను. సివిల్స్‌లో రాణించి, ప్రజలకు సేవలందించాలన్నదే నా లక్ష్యం.

– ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే...



ఏపీ ఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయి 159వ ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్‌లో 681 వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్సెడ్‌లో మంచి ర్యాంకు వస్తుందనే నమ్మకంతో ఉన్నాను. నాన్న కృష్ణారెడ్డి, అమ్మ హరిత నిరంతర ప్రోత్సాహం మంచి ర్యాంకు రావడానికి దోహదం చేసింది. కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌లో ఐఐటీలో చదవడమే ఆశయంగా సన్నద్ధమవుతున్నాను.

– సూరం సాయిస్వప్నిత్ కుమార్‌రెడ్డి


వినూత్న పరిశోధనలపై దృష్టి



ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు వచ్చింది. మెడిసిన్‌లో పీజీ పూర్తి చేసిన అనంతరం వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరిస్తాను. అమ్మ ఎస్.భారతి, నాన్న మదన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. నాన్న ఫిజిక్స్ స్కూల్‌అసిస్టెంట్ కావడంతో సైన్స్‌లో వచ్చే సందేహాలను నాన్న నివృత్తి చేస్తూ... సబ్జెక్టుపై మక్కువ పెరిగేలా చేశారు. నీట్‌లో సాధించిన 752వ ర్యాంకు అమ్మా,నాన్నలకు అంకితం చేస్తున్నా.

– శ్రీ వాత్సవరెడ్డి, అనంతపురం

ఎయిమ్స్‌లో మెడిసిన్ లక్ష్యం



నీట్‌లో జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు, ఏపీ ఈఏపీసెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయిలో 44వ ర్యాంకు వచ్చింది. అమ్మ సుమతి, నాన్న పురుషోత్తం ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. మెడిసిన్ చేయాలనేది నా కల. అమ్మా,నాన్నల ప్రోత్సాహంతో నా కలను సాకారం చేసుకుంటా. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్ పూర్తి చేయాలనుకుంటున్నాను. త్వరలోనే ఆ లక్ష్యాన్ని చేరుకుంటాను.

– జి.గిరి వర్షిత, అనంతపురం

'నీట్'లో మెరిసిన విద్యార్థులు



రఘురామిరెడ్డి (ఆలిండియా 15వ ర్యాంకు)



జయవర్ధన్ ఆలిండియా 318వ ర్యాంకు)



తరుణ్ (ఈడబ్ల్యూఎస్ కేటగిరీ 244వ ర్యాంకు)

తాడిపత్రి టౌన్/ రాయదుర్గం టౌన్ : ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ –2023 పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరిశారు. మెరుగైన ర్యాంకులతో సత్తా చాటారు. తాడిపత్రి పట్టణానికి చెందిన కార్డియాలజిస్ట్ చంద్రమౌళీశ్వరరెడ్డి, గైనకాలజిస్ట్ హేమలత దంపతుల కుమారుడు కంచాని రఘురామిరెడ్డి 715/720 మార్కులతో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 11వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, కార్డియాలజిస్ట్‌గా రోగులకు వైద్య సేవలందించాలన్నదే తన ఆశయమని కంచాని రఘురామిరెడ్డి తెలిపారు. ఇదే పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగి లోక్‌నాథ్ చౌదరి, మున్సిపల్ హైస్కూల్ టీచర్ విజయలక్ష్మి దంపతుల కుమారుడు జయవర్ధన్ 700/720 మార్కులతో జాతీయస్థాయిలో 318వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 227వ ర్యాంకు సాధించాడు. డాక్టర్‌గా ప్రజలకు సేవలందించాలన్నది తన లక్ష్యమని జయవర్ధన్ తెలిపారు. ఇక రాయదుర్గం పట్టణానికి చెందిన రాచేపల్లి శివ, వరలక్ష్మి దంపతుల తనయుడు తడాల తరుణ్ 640/720 మార్కులతో జాతీయస్థాయిలో 2823వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 244వ ర్యాంకు సాధించాడు. కుమారుడు ఉత్తమ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

పోలీసు బందోబస్తు నడుమ 'నితిన్ సాయి' పనుల తనిఖీ



కొలతలు తీస్తున్న అధికారులు

ముదిగుబ్బ: నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలోచేపట్టిన రోడ్డు పనుల తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన సమయంలో నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కొందరు గుండాయిజం చేసి అధికారులను భయపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఉదయం పోలీసు బందోబస్తుతో అధికారులు తనిఖీలు కొనసాగించారు.

కిరాణా దుకాణం దగ్ధం

పామిడి: స్థానిక నాల్గో వార్డులోని పీఎండీ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీదేవి ఇంట్లో బుధవారం వేకువజాము 3 గంటలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన లక్ష్మీదేవి కుటుంబసభ్యులు ఆగమేఘాలపై బయటకు పరుగుతీశారు. గమనించిన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేలోపు ఇంట్లో నిర్వహిస్తున్న కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

ఎస్కేయూ పురోగతికి భ'రూసా'

- రూసా పథకం కింద రూ.20 కోట్ల నిధులు
- నూతనంగా రెండు హాస్టళ్ల నిర్మాణం
- రిపేరీలు, క్యాంపస్ సుందరీకరణ సైతం..
- కొత్త పరికరాలు, డిజిటల్ తరగతుల ఏర్పాటు



ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పురోగతికి రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) పథకం అండగా నిలిచింది. నాణ్యమైన పరిశోధన, బోధనాభ్యాసన పెంపుదల, ఉత్తమ ఆవిష్కరణలకు దోహదం చేయడానికి రూసా పథకం తోడ్పాటునందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో నిధులు జమ చేస్తాయి. ఎస్కేయూకు రూ.20 కోట్ల నిధులు రూసా పథకం కింద మంజూరయ్యాయి. నాలుగు రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులు వెచ్చించారు. ఇందులో మొత్తం రూ.14 కోట్లు ఖర్చు చేయగా, తక్కిన రూ.6 కోట్లు వ్యయం చేయాల్సి ఉంది.

నూతన భవనాలు అందుబాటులోకి

క్యాంపస్‌లో నూతనంగా ఉమెన్స్ హాస్టల్, మెన్స్ హాస్టల్ నిర్మించారు. ఉమెన్స్ హాస్టల్‌ను 50 గదుల నిర్మాణంతో రూ.3.25 కోట్లు, మెన్స్ హాస్టల్ నిర్మాణానికి రూ.3.25 కోట్లు ఖర్చు చేశారు. అకడమిక్ భవనంలో టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటుకు రూ.50 లక్షలు వెచ్చించారు. నూతన నిర్మాణాలకు రూ.7 కోట్లు ఖర్చు చేశారు. నీటి నిల్వకు రూ.53.50 లక్షలతో సంపులు నిర్మించారు. పైప్‌లైన్ నిర్మాణానికి రూ.48 లక్షలు కేటాయించారు. డ్రెయినేజీ, స్వీజ్ లైన్స్ రూ.1.21 కోట్లు, ఆల్టర్నేటివ్ ఎనర్జీ రిసోర్సెస్‌కు రూ.1.45 కోట్లు, క్యాంపస్ సుందరీకరణకు రూ.40 లక్షలు, లైబ్రరీ భవనం రిపేరీలకు రూ.50 లక్షలు, 7 హాస్టళ్లలో మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.1.59 కోట్లు, ల్యాబోరేటరీల మరమ్మతులకు రూ.43 లక్షలు ఖర్చు చేయనున్నారు.

- మొబైల్ ల్యాబోరేటరీ స్టూడెంట్స్ ఫీల్డ్ విజిట్‌కు రూ.కోటి, మాయిచుర్ కంటెంట్ ఇన్ సాయిల్‌కు రూ.25లక్షలు, స్పెసిఫిక్ ఐటీఎస్ ఎల్కక్ట్రో మీటర్‌కు రూ.10 లక్షలు, డిజిటలైజేషన్ వర్క్ ఇన్ లైబ్రరీకి రూ.21.83 లక్షలు, క్యాంపస్ నెట్‌వర్క్‌కు రూ.8.80 లక్షలు, వైఫై సౌకర్యానికి రూ.31.22 లక్షలు, సెంట్రల్ కంప్యూటర్ కోసం రూ.1.74 కోట్లు, 3 డిజిటల్ తరగతి గదులకు రూ.80లక్షలు, క్రీడా పరికరాలకు రూ.17.96 లక్షలు, మల్టీమీడియా స్టూడియో సెంటర్ ఏర్పాటుకు రూ.1.15 కోట్లు వెచ్చించనున్నారు.

యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు



ఎస్కేయూ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యమైన పరిశోధనలు, పటిష్టమైన బోధనాభ్యాసన ప్రక్రియ జరిగేలా కృషి చేస్తున్నాం. రూసా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన నిర్వహించేలా చర్యలు చేపట్టాం. త్వరలో వచ్చే న్యాక్ గ్రేడింగ్‌లోనూ మెరుగైన ర్యాంకు రావాలని కృషి చేస్తున్నాం.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

న్యాక్ గ్రేడింగ్ మెరుగుదల అయితే..

నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గ్రేడింగ్‌ను బట్టి రూసా నిధులు మంజూరు చేస్తుంది. న్యాక్‌లో ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు రూసా పథకం నుంచి అందనుంది. ప్రస్తుతం ఎస్కేయూకు న్యాక్ బీ గ్రేడ్ ఉండడంతో రూ.20 కోట్ల నిధులు అందాయి. తాజాగా న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లారు. న్యాక్‌లో గ్రేడింగ్ మెరుగుదల అయి ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు అందుతాయి. వచ్చే 5 సంవత్సరాలకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో న్యాక్‌లో మెరుగైన పాయింట్లు వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే క్యాంపస్ సుందరీకరణకు చర్యలు చేపట్టారు.

ఊయలే ఉరి తాడైంది!

- చీర మెడకు చుట్టుకుని బాలుడి మృతి



పవన్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

గుంతకల్లు రూరల్: ఊయల కోసం వేసిన చీర ఉరి తాడై ఓ బాలుడి ఉసురు తీసింది. ఈ సంఘటన బుధవారం గుంతకల్లు మండలం మొలకలపెంట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు...గ్రామానికి చెందిన శేషయ్య, వాణి దంపతులకు కుమారుడు పవన్ (10), కుమార్తె శిరీష ఉన్నారు. శేషయ్య వ్యవసాయం చేసుకుంటూనే.. ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ వాహనం నిర్వహిస్తూ భార్యా పిల్లలను పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయాన్నే రేషన్ పంపిణీకి శేషయ్యతో పాటు భార్య కూడా వెళ్లింది. కుమార్తె శిరీష ఆడుకోవడానికి బయటకు వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న పవన్ చీరతో వేసిన ఊయలలో ఊగుతూ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చీర అతని మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక మృతిచెందాడు. ఆడుకోవడానికి ఇంటికి వచ్చిన ఇరుగూ పొరుగు పిల్లలు గమనించి బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. కుమారుణ్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కాగా.. పవన్ గుంతకల్లులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్లలేదు.

రిమాండ్‌కు 17 మంది

యల్లనూరు: ఘర్షణ కేసులో 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం వారు విలేకరులతో మాట్లాడుతూ.. యల్లనూరు మండలం బొప్పేపల్లిలో ఆదివారం జరిగిన పెద్దమ్మ జాతరలో రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. జాతరలో పొట్టేళ్లను బలి ఇచ్చే విషయంలో తాము ముందంటే తాము ముందు అంటూ ఆదివారం ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా... సోమవారం ఉదయం మరోసారి రెండు వర్గాలు ఒకరిపై ఒకరు సవాల్ విసురుకుని రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో బాలశివ, ఓబులేసు, వీరప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి అప్పట్లో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలకు చెందిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విచారణ అనంతరం బుధవారం ఉదయం 17 మందిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దమ్ముంటే బాబు పాలనపై చార్జ్‌షీట్ విడుదల చెయ్

- కాలవకు ప్రభుత్వ విప్ కాపు సవాల్
- నిరాధార ఆరోపణలు మానుకోవాలంటూ హితవు
- 2024లో రాజకీయ సమాధి కాకతప్పదని హెచ్చరిక



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం కాకుండా దమ్ముంటే చంద్రబాబు పాలనపై చార్జ్‌షీట్ విడుదల చేయాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సవాల్ విసిరారు. బుధవారం సెల్ఫీ వీడియో ద్వారా కాలవపై ఆయన నిప్పులు చెరిగారు. జగన్ సర్కార్ నాలుగేళ్ల పాలనపై ప్రజాకోర్టులో చార్జ్‌షీట్ విడుదల చేస్తానంటూ కాలవ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 2014 ఎన్నికలకు ముందు ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు ఏమిటి? అధికారం చేపట్టిన తర్వాత వాటిని ఎంత వరకూ అమలు చేశారనే అంశాలపై చార్జ్‌షీట్ విడుదల చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. 'సంపూర్ణ రైతు రుణమాఫీ అన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తామన్నారు. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం మొత్తం విడిపిస్తామన్నారు. అధికారం చేపట్టిన తర్వాత వీటిలో ఏ ఒక్కటైనా అమలు చేయగలిగారా?' అంటూ నిలదీశారు. ఇంటికో ఉద్యోగం పేరుతో నిరుద్యోగుల ఓట్లు రాబట్టుకున్న చంద్రబాబు.. చివరకు ఊరికొకటైనా ఉద్యోగం ఇవ్వలేకపోయాడని ఎద్దేవా చేశారు. యువతను నిలువునా మోసం చేసిన నీచమైన బతుకులు టీడీపీ పెద్దలవన్నారు. గర్భిణులకు పండంటి బిడ్డ పథకం కింద రూ.10వేలు ఇస్తానన్న మాట ఏమైందన్నారు. ఆఖరుకు కడుపులో పెరిగే బిడ్డ నుంచి పండు ముసలి వరకూ అందరినీ దగా చేసిన చంద్రబాబు తీరుపై చార్జ్‌షీట్ షీట్ విడుదల చేస్తే శభాష్ అంటూ ప్రజలతో సన్మానం చేయిస్తానన్నారు. ఐదేళ్ల కాలంలో దోచింది చాలక చివరకు అధికారం కోల్పోయే సమయంలోనూ రూ.40 కోట్ల విద్యుత్ బకాయిలు ప్రజలపై భారం మోపిన ద్రోహి చంద్రబాబు అని గుర్తు చేశారు. 2024 ఎన్నికల తర్వాత రాజకీయంగా టీడీపీ సమాధి కాకతప్పదని హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం క్రైం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. బుధవారం అనంతపురంలోని ఐఎంఏ హాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవానికి ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణవేణితో పాటు ఆమె హాజరై, ప్రసంగించారు. ఏడాదికి కనీసం రెండుసార్లయినా రక్తదానం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేకరించిన రక్తంలో 30 శాతం ప్రభుత్వ రక్త నిధికి అందజేస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులేనన్నారు. ఆపద సమయంలో ఉన్న వారికి సకాలంలో రక్తం ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. అనంతరం ఇటీవల మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించి 590 యూనిట్ల రక్తం సేకరించిన గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ జె.రవీంద్ర, 202 యూనిట్ల రక్తాన్ని సేకరించిన వైఎస్సార్ సీపీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి, 201 యూనిట్ల రక్తాన్ని సేకరించిన ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం సురేంద్ర తదితరులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ లక్ష్మణ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలత

- జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ దివాకరరావు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈనెల 13న జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ నేతృత్వంలో తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళితే.. ప్రాధాన్యత క్రమంలో వాటిని నెరవేర్చేందుకు సానుకూలత చూపారన్నారు. ఇది ఉద్యోగుల ప్రభుత్వమని, ఉద్యోగులకు వీలైనంత ఎక్కువగా మంచి చేయాలనే చూస్తామని, త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం పేర్కొన్నట్లు తెలిపారు.

నీట్ ఫలితాల్లో ఎక్సెల్ అకాడమీ సంచలనం




నీట్-2023 ర్యాంకర్లు: పి.తరణి, ప్రణీత, ఎస్.వెంకటసాయి భార్గవ్, కె.శ్రీజ, ఎ.వర్ష

అనంతపురం : వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో కర్నూలుకు చెందిన ఎక్సెల్ అకాడమీ సంస్థ మూడేళ్లుగా సంచలనాలు సృష్టిస్తోంది. సంస్థలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ప్రముఖ వైద్య విద్యాసంస్థల్లో సీట్లు సాధించి సత్తా చాటు తున్నారు. ఎంబీబీఎస్ సీట్ల సాధనలో అకాడమీ అగ్రగామిగా నిలుస్తోంది. నీట్–2021 ఫలితాల్లో 51 మంది విద్యార్థుల్లో 12 మంది, 2022లో 145 మందికి గాను 28 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. బుధవారం విడుదలైన నీట్–2023 పరీక్ష ఫలితాల్లో 150 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించే అవకాశం ఉందని ఎక్సెల్ అకాడమీ డైరెక్టర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన పి.తరణి (598 ర్యాంకు), ప్రణీత (590), ఎస్.వెంకటసాయి భార్గవ్ (583), కె.శ్రీజ (569), ఎ.వర్ష (567) తదితరులను డైరెక్టర్ అభినందించారు.

నేటి నుంచి విత్తుకు అదను







- ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల హెక్టార్లలో పంటల సాగు
- ఏఆర్ఎస్‌లో అందుబాటులో బ్రీడర్, ఫౌండేషన్ సీడ్స్



డాక్టర్ బి.సహదేవరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: 'ముంగారు' (ఖరీఫ్)లో అన్ని రకాల పంటల సాగుకు గురువారం నుంచి వాతావరణం అనుకూలంగా ఉంది. ఈ మేరకు బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం) డాక్టర్ బి.సహదేవరెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుంచి జూలై 15వ తేదీ వరకూ వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, జొన్న, మొక్కజొన్న, రాగి... తదితర అన్ని రకాల పంటల సాగుకు మేలైన సమయన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి..

అధికారుల అంచనా మేరకు ఈ ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చే అవకాశముంది. ఒకవేళ వర్షాలు కొంత ఆలస్యమైనా జూలై ఆఖరు వరకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్తు వేసుకోవచ్చునని శాస్త్రవేత్తలు తెలిపారు. జూన్ 15 నుంచి జూలై ఆఖరులోపు విత్తు వేస్తే పంట దిగుబడులకు ఢోకా ఉండదన్నారు. కాకపోతే ఒకటికి రెండు సార్లు భూమిని దుక్కి చేయాలన్నారు. దీని వల్ల భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా పంట కాలంలో బెట్ట ఏర్పడినా ఇబ్బంది ఉండదని వివరించారు. అలాగే నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తన సాంద్రత, విత్తనశుద్ధి, సకాలంలో కలుపు నివారణ, అంతర్‌కృషి లాంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులతో వ్యవసాయం లాభసాటి అవుతుందన్నారు.

అందుబాటులో ఉన్న విత్తన రకాలు, ధరలు ఇలా..

విత్తన రకం	ధర (కిలో)
కే-6 వేరుశనగ (బ్రీడర్ సీడ్)	రూ.170
కే-6 వేరుశనగ (ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్)	రూ.120
విశిష్ట వేరుశనగ (టీసీజీఎస్-1694)	రూ.170
విశిష్ట వేరుశనగ (బ్రీడర్‌సీడ్)	రూ.170
విశిష్ట వేరుశనగ (ట్రూత్‌ఫుల్‌లేబుల్ సీడ్)	రూ.120
కంది (పీఆర్‌జీ-176 - ఫౌండేషన్ సీడ్)	రూ.120
సజ్జ (ఏబీవీ-04 - బ్రీడర్ సీడ్)	రూ.152
సజ్జ (ఏబీవీ-04 - ట్రూత్‌ఫుల్ లేబుల్‌సీడ్)	రూ.75

అందుబాటులో కొత్త వంగడాలు..

మంచి దిగుబడులు ఇచ్చే కొత్త రకం వంగడాలు, నాణ్యమైన విత్తనాలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు నేరుగా పరిశోధనా స్థానానికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు. పూర్తి వివరాలకు 94910 90978, 94416 52784, 85559 42733, 99896 25222 లో సంప్రదించవచ్చు.

కణేకల్లులో వైభవంగా ఊరి దేవర



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న గ్రామదేవతలు

కణేకల్లు: దాదాపు 120 ఏళ్ల తర్వాత కణేకల్లులో నిర్వహించిన ఊరి దేవర అంగరంగ వైభవంగా సాగింది. మూడ్రోజుల పాటు జరిగిన దేవర బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామదేవతలైన దేవమ్మ, కొల్లాపురమ్మ ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అతి పురాతనమైన ఊరిదేవర (జాతర) సంప్రదాయాన్ని కొనసాగించాలని 120 ఏళ్ల తర్వాత గ్రామ పెద్దలంతా ఓ నిర్ణయానికొచ్చి విరాళాలకు పిలుపునిచ్చారు. దీంతో స్పందించిన ప్రజలు భారీగా విరాళాలు అందజేసి దేవరను భక్తిశ్రద్ధలతోనిర్వహించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం సాయంకాలం నుంచి అర్ధరాత్రి వరకూ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఈ వేడుకకు హాజరయ్యారు. బోనాల ఉత్సవం ముగిసిన తర్వాత బుధవారం వేకువజాము ఒంటి గంటకు అమ్మవారి ఆలయం ఎదుట దేవరపోతును బలిచ్చారు. అనంతరం పొలిని సంప్రదాయం ప్రకారం గ్రామం చుట్టూ సరిహద్దు వరకూ చల్లారు. ఏళ్ల తర్వాత జరిగిన ఈ వేడుకలకు బంధువులు, స్నేహితులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కణేకల్లు కిక్కిరిసింది. ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటి ముందు షామియానాలను వెలిశాయి. ఒక్కో కుటుంబం నాలుగైదు పొట్టేళ్లను బలి ఇచ్చి బంధువులు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ కణేకల్లు పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందు భోజనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల జేఏసీ కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీలు వన్నూరుషా, గొల్ల ఉమ, నాయకులు డాక్టర్ సోమన్న, సాదత్, మారెంపల్లి నాగరాజు, గొల్ల వెంకటేశులు, హెచ్.నాగరాజు, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పర్ భద్ర, నవలి ప్రాజెక్టులతో సీమ ఎడారే



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

రాప్తాడు: కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర, నవలి ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ ఎడారి అవుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం సీపీఐ నీటి సాధనకై తలపెట్టిన రైతు గర్జన ప్రచార జాతా రాప్తాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర కాలువ ఆధునీకరణ చేయాలని, హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 5,500 క్యూసెక్కుల నుంచి 10 వేలకు పెంచాలన్నారు. ఈ నెల 21న జరిగే రైతు గర్జనకు మండలంలోని రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, నియోజకవర్గ కార్యదర్శి శారద, మండల కార్యదర్శి రవీంద్ర పాల్గొన్నారు.

మెడికోల రక్తదానం



రక్తదానం చేసిన మెడికోలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాల 2కే22 బ్యాచ్‌కు చెందిన మెడికోలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బుధవారం జీజీహెచ్‌లోని రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు మాట్లాడుతూ ఏటా మెడికోలు రక్తదానం చేస్తూ సేవా నిరతి చాటుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రక్తనిధి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, టెక్నీషియన్లు కిరణ్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం



రక్తదాతలను సన్మానించిన డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం క్రైం: స్థానిక హిందీసేవాసదన్ మహా విద్యాలయ ప్రాంగణంలో అనంత రెడ్ డ్రాప్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం చేయడానికి యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రమేష్, కార్పొరేటర్ అబూసలేహ, ట్రస్టు చైర్మన్ సర్దార్‌వలి, సభ్యులు రాజు, ఆనంద్, దాదు, నవీన్ తదితరులున్నారు.

మార్కెట్‌లోకి హీరో మోటార్ కార్ప్ నూతన మోడల్



నూతన బైక్‌ను ఆవిష్కరిస్తున్న కల్యాణ చక్రవర్తి, శోభాదేవి

అనంతపురం సెంట్రల్: ద్విచక్రవాహన సంస్థ హీరో మోటార్‌కార్ప్ ప్రముఖ మోడల్ ప్యాషన్ ప్లస్‌లో కొత్త వర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. బీఎస్6 రెండో దశ నిబంధనలకు లోబడి రూపొందించిన ఈ బైక్‌లో 100 సీసీ ఇంజిన్ అమర్చారు. ఈ వాహనాన్ని బుధవారం సి. తిప్పయ్య మోటార్ ఎండీ కల్యాణ చక్రవర్తి, శోభాదేవి ఆవిష్కరించారు.

సులువుగా సర్టిఫికెట్!

- జీజీహెచ్‌లో పారదర్శకంగా సర్టిఫికెట్ల మంజూరు
- దళారులకు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు



ఉద్యోగం పొందిన ఓ యువతికి మెడికల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తున్న డిప్యూటీ ఆర్ఎంఓ వైవీ రావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో గురుకుల పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల విద్యార్థులకు, ఉద్యోగాలు పొందిన వారికి, బదిలీలకు సంబంధించి మెడికల్ బోర్డు సర్టిఫికెట్ అనివార్యంగా మారుతోంది. వీటి కోసం గతంలో రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వైవీ రావు పర్యవేక్షణలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, డాక్టర్ సునీత పారదర్శకంగా సర్టిఫికెట్లు అందిస్తున్నారు. దళారులకు ఆస్కారం ఇవ్వకుండా మెడికల్ బోర్డుకు నిర్దేశిత రుసుం చెల్లించిన వెంటనే సులువుగా సర్టిఫికెట్లను మంజూరు చేస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతా పకడ్బందీగా..

భవిష్యత్తులో ఎలాంటి కోర్టు, లీగల్ సమస్య తలెత్తకుండా ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్నారు. బ్రాట్‌డెత్ జరిగినా సంబంధిత కుటుంబ సభ్యుల వివరాలు, పేర్లలో ఏమైనా తప్పిదాలు చోటు చేసుకుంటే నోటరీ, గెజిటెడ్ ఆఫీసర్ సంతకాలు తీసుకుని సర్టిఫికెట్లు అందిస్తున్నారు. బ్రాట్‌డెత్‌కు సంబంధించి ఎన్ఎంసీ ప్రతిపాదించిన ఫార్మట్‌ను పూరించి, మృతుల కుటుంబీకులకు అందజేస్తున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు ఎక్స్‌రే, ఆల్ట్రాసౌండ్, వివిధ రకాల రక్తపరీక్షలు రోజు వ్యవధిలో పూర్తి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ బోర్డు సర్టిఫికెట్‌లను పకడ్బందీగా అందిస్తున్నారు. వారి సమస్యను బట్టి సంబంధిత వైద్యులు ఒకటికి రెండుసార్లు నివేదికలను తనిఖీ చేసి మంజూరు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఫిట్‌నెస్, జనన, మరణ ధృవీకరణ పత్రాలకు మొదటగా ఆర్ఎంఓ కార్యాలయంలో సంప్రదించాలి. ఫలానా సర్టిఫికెట్‌కు అనుగుణంగా మెడికల్ బోర్డుకు రెఫర్ చేసి, తద్వారా ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తాం. ఆస్పత్రిలో అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వైవీ రావు, డిప్యూటీ ఆర్ఎంఓ

వృద్ధురాలి గొలుసు అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వృద్ధురాలిపై ఇనుపరాడ్‌తో దాడిచేసి, ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన బుధవారం అనంతపురం నగరంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ పరిధిలోని మన్నీల గ్రామానికి చెందిన వృద్ధురాలు నారాయణమ్మ బత్తలపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. బుధవారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఆమె సాయంత్రం 4.30 గంటలకు మన్నీలా క్రాస్‌లో బస్సు దిగి గ్రామం వైపు కాలినడకన వెళుతుండగా ఓ యువకుడు మాట కలిపాడు. అనంతరం ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళుతూ నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే ఆమెను కిందకు దించి మెడలోని బంగారు గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో వృద్ధురాలు గొలుసును గట్టిగా పట్టుకుని, గట్టిగా కేకలు వేసింది. దీంతో యువకుడు తన వద్ద ఉన్న ఇనుప రాడుతో ఆమె తలపై మోదాడు. దీంతో గాయపడిన వృద్ధురాలు బంగారు గొలుసును వదిలేయడంతో యువకుడు లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. కాసేపటి తర్వాత అటుగా వచ్చిన స్థానికులు ఆమెను గమనించి ఆరా తీశారు. విషయం తెలుసుకుని వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వృద్ధురాలిని అనంతపురం జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అహుడా చైర్మన్‌ను కలసిన ఏపీఓ



మహాలక్ష్మి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఓ ఇస్సాక్ అహ్మద్

అనంతపురం క్రైం: స్థానిక అహుడా కార్యాలయంలో చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌ను అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ (ఏపీఓ) ఇస్సాక్ అహ్మద్ బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలని ఇస్సాక్ అహ్మద్‌కు అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ సూచించారు.

వ్యాధుల సమాచారం పంపాలి



పావని ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు వ్యాధుల సమాచారాన్ని ఆరోగ్యశాఖ కార్యాలయానికి తప్పక పంపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ఆ సూచించారు. బుధవారం నగరంలోని పావని, వైఎస్సార్, బీబీ, సుదర్శన్ ఆస్పత్రులను డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సూచించిన ఐహెచ్ఐపీ పోర్టల్‌లో రోజూ సంక్రమిత, గుర్తింపు పొందిన వ్యాధుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమాచారం జిల్లా కేంద్రం నుంచి రాష్ట్రస్థాయికి పంపాల్సి ఉందన్నారు. గ్రామస్థాయి, పట్టణ స్థాయిలోనూ వ్యాధుల గుర్తింపు, వాటి తీవ్రతను అంచనా వేసి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. డీఎంహెచ్ఓ వెంట డెమో త్యాగరాజు, ఎపిడమాలజిస్టు ఐడీఎస్‌పీ వేణుగోపాల్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ



ఆత్మకూరులో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాప్తాడు నుంచి భారీ బైక్ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆత్మకూరు: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు లే అవుట్ వద్ద నూతనంగా నిర్మించిన అమ్మ డెయిరీ ప్రారంభోత్సవానికి బుధవారం మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. మండల కేంద్రంలో పెద్ద ఎత్తున టపాసులు పేల్చి బైకు ర్యాలీ చేపట్టారు. మహిళలు సభకు వెళ్లడానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. మండలం నుంచి అనేక వాహనాల్లో వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన అమ్మ డెయిరీ ప్రారంభోత్సవానికి రాప్తాడు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్ ఆధ్వర్యంలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాప్తాడు నుంచి రుద్రంపేట మీదుగా ఆలమూరు జగనన్న లేఅవుట్ దగ్గరకు చేరుకుంది. అలాగే మండలవ్యాప్తంగా దాదాపుగా 50 బస్సుల్లో పాడి మహిళా రైతులు తరలి వెళ్లారు.



రంగంపేట గోపాల్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన రంగంపేట గోపాల్‌రెడ్డి
- ఆహ్వానించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: మాజీ కార్పొరేటర్, టీడీపీ నాయకుడు రంగంపేట గోపాల్‌రెడ్డి టీడీపీకి షాక్ ఇచ్చారు. బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నాయకుల సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయన గతంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా పని చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంగంపేట గోపాల్‌రెడ్డికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగంపేట గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజల కల అయిన పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి ఎమ్మెల్యే సాకారం చేశారన్నారు. పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించడం, రూ. 20 కోట్లు తన సొంత నిధులు ఖర్చు చేసి అమ్మ డెయిరీని స్థాపించి పాడి రైతులకు అండగా నిలబడ్డ ఎమ్మెల్యేకు అండగా ఉంటామన్నారు. డెయిరీ విజయవంతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. డెయిరీ నిర్వహణలో తమ కుటుంబానికి అపారమైన అనుభవం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ రాప్తాడులో ప్రకాష్‌రెడ్డిని అఖండమైన మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు మండల నాయకులు నారాయణరెడ్డి, కోలాల ఉజ్జన్న, సర్పంచ్ నడిపి ఉజ్జినప్ప, మాజీ సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, బిల్లే నాగభూషణం, జూటూరు సుబ్రమణ్యం, బిల్లే యల్లప్ప, సోమనాథ్, లోకేష్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం



అవగాహన కల్పిస్తున్న రైల్వే శాఖ అధికారులు

అనంతపురం సిటీ: రైల్వే క్రాసింగ్‌లు దాటే సమయంలో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలబారిన పడకుండా సురక్షితంగా గమ్యస్థానం చేరగలరని రైల్వే శాఖ అధికారులు స్పష్టం చేశారు. 'ఇంటర్నేషనల్ లెవల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే' కార్యక్రమంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ డీఆర్ఎం వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు అనంతపురంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో గల రైల్వే క్రాసింగ్ వద్ద ఆ శాఖ అధికారులు బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. గుంతకల్లు డివిజన్ సీనియర్ డీఎస్ఓ చంద్రశేఖర్, సేఫ్టీ కౌన్సిలర్లు అర్షద్, హనుమంతు, దస్తగిరి, రాంబాబు, నాయర్, నాగరాజారావు, సెక్షన్ ఇంజినీర్ రవిబాబు తదితరులు బ్యానర్లు కట్టి, వాహనచోదకుల్లో అవగాహన కల్పించారు. రైళ్లు వచ్చే సమయంలో గేట్‌లు వేశాక అడ్డదిడ్డంగా దూరడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. రైల్వే క్రాసింగ్‌లలో ఎంత అప్రమత్తంగా ఉంటే అంత సురక్షితమని స్పష్టం చేశారు. తొందరగా గమ్యం చేరాలనే ఆతృతతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటే కుటుంబాన్ని బజారున పడేసినట్లు అవుతుందని, తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని 5, 10 నిమిషాలు ఆలస్యమైనా రైళ్లు వెళ్లాకే రైల్వే క్రాసింగ్‌లు దాటాలని సూచించారు.

చెగువేరా జీవితం యువతకు ఆదర్శం



చెగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: అమెరికా సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన విప్లవవీరుడు చెగువేరా జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ అన్నారు. చెగువేరా జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదులకు చెగువేరా సింహస్వప్నం అన్నారు. క్యూబా విముక్తి కోసం పోరాటం చేసి స్వాతంత్య్రం తీసుకొచ్చారన్నారు. బొలీవియాకు వెళ్లి ఆ దేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలో అమరుడయ్యారన్నారు.సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు కుళ్లాయిస్వామి, మోహన్‌కృష్ణ, రమణయ్య, లిఖిల్, వంశీ, ఆనంద్, నవీన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: ప్రభుత్వ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నగర అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ, సెక్రటరీ ఓబిరెడ్డి, అధ్యక్షుడు గోపీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతినందించారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామని వెల్లడించారు.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం: ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధించేందుకు అంకితభావంతో కృషి చేయాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో బుధవారం ఆర్డీటీ సెట్–2023లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2004లో మొదటి సారిగా ఈ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టినపుడు పదో తరగతిలో 500పైన మార్కులు వచ్చే వారు పదుల సంఖ్యలో ఉండే వారని, నేడు వేల సంఖ్యలో 500 మార్కులు పైన వచ్చే వారు ఉంటున్నారు. ఇప్పటిదాకా 5,297 మంది విద్యార్థులకు స్పెషల్ ప్రోగ్రామ్ కింద ఉన్నత చదువులు చదివించామన్నారు. విజయవాడ, తిరుపతి, కర్నూలు, హైదరాబాద్‌లో ఈ ఏడాది 360 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి. మోహన మురళి, రీజనల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

40 వేల క్వింటాళ్ల విత్తన పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియలో భాగంగా బుధవారం నాటికి 44,890 మంది రైతులకు 40 వేల క్వింటాళ్ల విత్తనకాయలు అందజేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి యు.ఉమామహేశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీకే వేదికగా విత్తన వేరుశనగ, కందులు, రాగులు, కొర్రలు, పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్లు, పంపిణీ కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 62 వేల క్వింటాళ్ల విత్తనాన్ని సరఫరా చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఎంఈఓ పోస్టుల మంజూరుపై హర్షం

రాప్తాడురూరల్: ప్రతి మండలానికి 2వ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పోస్టులు మంజూరు చేయడం పట్ల వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఓబుళపతి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు హెచ్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి. రాజమోహన్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ రమణా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా ప్రసాద్‌రెడ్డి, సురేష్ కుమార్, విశ్వనాథరెడ్డి తదితరులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ ద్వారా స్పెషల్ పే, అలవెన్సులు పెంచుతూ జీఓ విడుదల చేశారని పేర్కొన్నారు.

ఇష్టారాజ్యంగా సర్వజనాస్పత్రి సీఎంఓల తీరు

- క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల తీరును తప్పుబట్టిన హెచ్ఓడీలు



హెచ్ఓడీలతో సమావేశమైన సూపరింటెండెంట్ రఘునందన్

అనంతపురం క్రైం: 'ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు (సీఎంఓ) ఇష్టానుసారంగా కేసులను అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ), సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. సాధారణ కడుపు నొప్పితో బాధపడుతున్న రోగిని కూడా ఏఎంసీలో అడ్మిట్ చేస్తున్నారు. తక్షణం ఇటువంటి చర్యలకు అడ్డుకట్ట వేయాల్సి అవసరం ఉంద'ని ప్రొఫెసర్లు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ భాస్కర్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌కు విజ్ఞప్తి చేశారు. సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ అధ్యక్షతన బుధవారం హెచ్ఓడీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ భీమసేనాచార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో బోధనాస్పత్రిలోని అన్ని విభాగాలకు పీజీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మౌలిక సదుపాయాలు సమకూరాయన్నారు. అటువంటప్పుడు ఆయా విభాగాలకు సంబంధించి సాధారణ కేసులను అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ)లో ఉంచితే ఎలాగని ప్రశ్నించారు. ఏఎంసీలో 21 పడకలుంటే అందులో గైనిక్ రక్తహీనత, సర్జికల్ విభాగం కడుపునొప్పి, ఈఎన్‌టీ ట్రకాస్టమీ కేసులను దాదాపు నెలపాటు ఉంచితే ప్రాణాపాయ కేసులకు ఏ విధంగా సేవలందించాలన్నారు. సర్జికల్ విభాగంలో ఉంచాల్సిన కేసులను ఇక్కడకు ఎందుకు పంపారని మెడిసిన్ పీజీలు ప్రశ్నిస్తే సర్జికల్ విభాగానికి చెందిన కొందరు పీజీలు నోరుపారేసుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఆపరేటర్ లేకపోవడంతో కేసులను ఏఎంసీకు పంపుతున్నట్లు ఇన్‌చార్జ్ సర్జికల్ హెచ్ఓడీ డాక్టర్ శివశంకర్‌నాయక్ పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ సర్జికల్ విభాగానికి ఏసీలు, ఆపరేటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. గైనిక్ విభాగానికి వెంటిలేటర్లను ఏర్పాటు చేస్తామని, ప్రమాదకర కేసులను గైనిక్ ఐసీయూలోనే ఉంచాలని ఆదేశించారు. ఇటీవల ఓ న్యూరో కేసును క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పంపారని, తాము స్పందించి సేవలందించే సమయంలో బాధిత వ్యక్తి మృత్యువాత పడ్డారని న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. సంబంధిత పీజీలు ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం హెచ్ఓడీ, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ద్వారా తమకు సమాచారం పంపాలన్నారు. సంబంధిత వైద్యులు రాకపోవడంతో రెఫర్ చేయాల్సి వస్తోందని క్యాజువాలిటీ వైద్యులు చెప్పగా.. గంట పాటు క్యాజువాలిటీలో ఉంచి సేవలందించాలని, అనంతరం వార్డుకు షిఫ్ట్ చేయాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హెచ్ఓడీలు పేర్కొనడంతో ఈఎండీ వైద్యులు డాక్టర్ నూరుల్లాఖాన్, డాక్టర్ కళ్యాణ్ అందుబాటులో ఉన్నారని, త్వరలో ఆ సేవలను అందుబాటులోకి తీసుకువద్దామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల జింకను మట్టుబెట్టిన గ్రామస్తులు

కేసు నమోదు చేసిన అటవీశాఖ

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండు వేసవి, మరో వైపు నీటి కోసం అడవిని వీడి వచ్చిన చుక్కల జింకను ఆ గ్రామస్తులు నిర్దాక్షిణ్యంగా మట్టుబెట్టారు. తల, మొండెం వేరు చేసి వాటాలు వేసుకునే సమయంలో అటవీ అధికారులు రంగంలోకి దిగారు. వారిని చూసిన వేటగాళ్లు అక్కడ నుంచి పరారయ్యారు. మండలంలోని గింజర్తి గ్రామ శివారులో ఓ చుక్కల జింక పచ్చిక మేస్తూ మిరియాల నానిబాబు పొలంలోకి వచ్చింది. ఇది గమనించిన స్థానికులు దానిని తరుముతూ కత్తితో దాడి చేయడంతో తల మొండెం వేరయ్యాయి. దాడిచేసిన వారు వాటాలు వేసుకునేందుకు సిద్ధపడ్డారు. ఈ దారుణాన్ని చూసిన కొంత మంది అటవీఅధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకొన్న అటవీఅధికారులు స్థానిక పశువైద్యాధికారి తరుణ్‌తో జింకకు పోస్టుమార్టం చేయించారు. మగ జింక, మూడు సంవత్సరాల వయసు ఉంటుదని పశువైద్యాధికారి పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల కోసం గాలిస్తున్నామని అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర తెలిపారు.

యాసిడ్ దాడి బాధితురాలికి అండగా ప్రభుత్వం

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఏలూరులో యాసిడ్ దాడికి గురైన బాధిత మహిళకు, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. బుధవారం కొవ్వూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. గాయపడిన మహిళను వైద్య సేవల నిమిత్తం విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలించారన్నారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. యాసిడ్ దాడి దురదృష్టకరమని, దాడికి పాల్పడిన నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశించామన్నారు.

బీఎల్ సంతోష్‌తో సుజనా చౌదరి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్‌తో పార్టీ మాజీ ఎంపీ సుజనా చౌదరి భేటీ అయ్యారు. బుధవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో సంతోష్‌ను కలిసిన సందర్భంగా ఏపీలోని తాజా రాజకీయ వ్యవహారాలను సుజనా చౌదరి వివరించారు. రానున్న అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై బీఎల్ సంతోష్‌తో మాజీ ఎంపీ సుజనా చౌదరి చర్చించారు.

చెత్త కుండీలో అప్పుడే పుట్టిన పసికందు.. హాస్టల్‌లో బాలిక ప్రసవం–కిటికీ నుంచి బిడ్డను విసిరేసిన వైనం వంటి వార్తలు వింటుంటే హృదయం ద్రవించి పోతుంది. మరోవైపు.. ఐవీఎఫ్ సెంటర్లలో శిశు విక్రయాలు.. పిల్లలను కిడ్నాప్ చేసి రూ.లక్షలకు అమ్మేస్తున్న ఘటనలూ చూస్తున్నాం. అవాంఛిత బిడ్డలను వదిలించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తుంటే.. సంతానం కలగని తల్లిదండ్రులు ఎందరో పిల్లల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. మారుతున్న జీవన శైలి, అనారోగ్యం, ఆలస్యంగా వివాహాలు చేసుకోవటం, కెరీర్ కోసం పిల్లలను వాయిదా వేయటం వంటి కారణాల వల్ల సంతానలేమి సమస్య బాగా పెరిగిపోయింది. ఫలితంగానే.. ప్రతి పట్టణంలో ఇప్పుడు ఫెర్టిలిటీ సెంటర్లు వెలిశాయి. అయితే, వైద్య విధానాల ద్వారానూ సంతానం కలగని తల్లిదండ్రులు దత్తత తీసుకోవచ్చు. (ఏపీ నెట్‌వర్క్)



అనాథలకు అమ్మతోడు

తీవ్రమవుతున్న సంతానలేమి సమస్యలు

దత్తత గతం	నిబంధనలు సరళతరం చేసిన కేంద్రం
కంటే ఇప్పుడు	పిల్లలున్నా ఆర్థిక స్థోమత ఉంటే దత్తత తీసుకోవచ్చు
సులభం	ప్రత్యేక ఏజెన్సీల ఏర్పాటుతో ఆలస్యం నివారణ

దత్తత ఎంతో మేలు

గతంలో దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండేవి. కేంద్రప్రభుత్వం 2022 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందటం ఇప్పుడు సులభం. దత్తత తీసుకోదలిచిన తల్లిదండ్రులు చట్టబద్ధంగా మాత్రమే ఆ పని చేయాల్సి ఉంటుంది. మరే ఇతర పద్ధతుల్లో పిల్లలను దత్తత తీసుకుంటే చట్టరీత్యా నేరం. అలాంటి వారు శిక్షార్హులు అవుతారు. గతంలో పిల్లలు కలగని దంపతులు మాత్రమే దత్తత తీసుకునేందుకు అర్హులు. తాజాగా ఈ నిబంధనను తొలగించి.. పిల్లలు ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత కలిగిన వారు దత్తత తీసుకునే అవకాశం ఇచ్చారు. పిల్లలు కావాలనుకున్న వారు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే.. వారు వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లోని శిశుగృహాల్లో దత్తతకు సిద్ధంగా ఉన్న పిల్లల వివరాలు తెలియజేస్తారు. ఆయా రాష్ట్రాల్లో ఏర్పాటైన స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలు దత్తత ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తోడ్పడతాయి. దేశవ్యాప్తంగా ఉన్న శిశు గృహాల్లో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు 2,188 మంది దత్తతకు సిద్ధంగా ఉన్నారు. మన రాష్ట్రంలోని శిశు గృహాల్లో సుమారు 120 మంది బాల బాలికలు ఉన్నారు. మరోవైపు దేశ విదేశాలకు చెందిన 31 వేల మందికి పైగా తల్లిదండ్రులు పిల్లలను దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. రంగు, భాష, ప్రాంతం తదితర ప్రాధాన్యతల కారణంగా పిల్లలందరినీ దత్తతకు అప్పగించటంలో జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు సైతం ఏజెన్సీలు కృషి చేస్తున్నాయి. దత్తత కోరే తల్లిదండ్రులకు అవగాహన కల్పించటంతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లోని శిశు గృహాల్లో ఉన్న పిల్లల వివరాలను అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తున్నారు.

మరిన్ని వివరాలు కావాలంటే..

దత్తతకు సంబంధించిన మరిన్ని వివరాలు అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణాధికారి కార్యాలయంలో లభిస్తాయి. అనాథ శిశువులను సంరక్షించేందుకు సైతం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రోడ్డు పక్కన, కాలువలోనూ చెత్త కుండీల్లోనూ శిశువులను గుర్తిస్తే సమాచారం తెలిపేందుకు టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లు 1098, 181, 100లను ఏర్పాటు చేసింది.

ఎలా దరఖాస్తు చేయాలంటే..

దత్తత తీసుకోదలచిన వారు పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, దంపతుల ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆరోగ్య ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. దత్తత కోసం ఏడు దశలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

- దత్తత తీసుకోవాలనుకుంటున్న తల్లిదండ్రులు వారి పాన్‌కార్డు ద్వారా www.cara.nic. in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.
- సిద్ధం చేసుకున్న ధ్రువీకరణ పత్రాలను వెబ్‌సైట్‌లో వారి లాగిన్ ఐడీ ద్వారా 30 రోజుల లోపు అప్‌లోడ్ చేయాలి. దత్తత ఏజెన్సీకి గృహ అధ్యయన నివేదిక సమయంలో రూ.6 వేలు డీడీ తీసి ఇవ్వాల్సి ఉంటుంది.
- తర్వాత దత్తత ఏజెన్సీ గృహ అధ్యయన నివేదికను తయారు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తుంది.
- అర్జీదారు కోరుకున్న లక్షణాలున్న పిల్లల వివరాలు రిఫర్ చేస్తూ వారి మొబైల్‌కు సమాచారం అందుతుంది. ఆ సమాచారం ప్రకారం 48 గంటలలోపు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి నచ్చిన బిడ్డను రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.
- రిజర్వు చేసుకున్న బిడ్డను 20 రోజులలోపు సరిపోల్చుకుని దత్తత ఏజెన్సీ వద్దకు వెళ్లి బిడ్డ నచ్చిందని ఆమోదం తెలియజేసి రూ.40 వేలు డీడీ ద్వారా చెల్లించి బిడ్డను పొందవచ్చు.
- బిడ్డను పొందిన వారం రోజులలోపు సదరు దత్తత ఏజెన్సీ దత్తతకు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ స్థానిక కుటుంబ న్యాయస్థానం లేదా జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పించి దత్తత ఉత్తర్వుల ప్రతిని పొందాలి.
- దత్తత తీసుకున్న బిడ్డ సంక్షేమం కోసం స్థానిక దత్తత ఏజెన్సీకి చెందిన సోషల్ వర్కర్ రెండు సంవత్సరాల పాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గృహ సందర్శన చేసి ఫాలోఅప్ రిపోర్టును 'కారా' పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఫాలోఅప్ సందర్శనకు వచ్చిన ప్రతిసారి దత్తత ఏజెన్సీకి రూ.2 వేలు డీడీ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది.

2022-23లో దత్తతకు ఇచ్చిన పిల్లల వివరాలు

శిశు సంరక్షణ కేంద్రం	భారతీయులకు	విదేశీయులకు
	దత్తత ఇచ్చిన పిల్లల సంఖ్య	
అనంతపురం	8	0
చిత్తూరు	4	1
తూర్పు గోదావరి	4	0
గుంటూరు	8	0
కృష్ణా	10	1
కర్నూలు	7	3
నెల్లూరు	8	0
ప్రకాశం	4	3
శ్రీకాకుళం	3	1
విశాఖపట్నం	5	0
విజయనగరం	6	1
పశ్చిమ గోదావరి	5	0
వైఎస్సార్	7	1
మొత్తం	79	11

ఫిషరీస్ వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం

- నరసాపురంలో తాత్కాలిక తరగతి గదుల భవనాన్ని ప్రారంభించిన మంత్రి సీదిరి
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి కోర్సుల నిర్వహణ



పశ్చిమ గోదావరి జిల్లా లిఖితపూడిలో వర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ఫిషరీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కార్యకలాపాలు బుధవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. 2023–24 విద్యా సంవత్సరంలో కోర్సుల నిర్వహణకు సంబంధించి నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలోని తుఫాన్ షెల్టర్ బిల్డింగ్‌లో ఏర్పాటుచేసిన తాత్కాలిక తరగతిగదులను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు నరసాపురం మండలం లిఖితపూడిలో 40 ఎకరాల్లో రూ.332 కోట్లతో నిర్మిస్తున్న ఫిషరీస్ యూనివర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులను మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్సిటీ పరిపాలనా భవనానికి ప్రభుత్వం తొలివిడతగా కేటాయించిన రూ. 100 కోట్లతో చేపడుతున్న పనుల పురోగతిని ముదునూరి మంత్రి అప్పలరాజుకు వివరించారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, హాస్టల్ భవనాలను నిర్ణీతకాలవ్యవధిలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ మత్స్య ఎగుమతుల్లో ఏపీ ఇప్పటికే దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. మత్స్య ఉత్పత్తులను మరింత పెంచడం, మత్స్యకారుల వలసలు నివారించి వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ ప్రయత్నంలో భాగంగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురంలో అంతర్జాతీయ ఫిషరీస్ యూనివర్సిటీ నెలకొల్పుతున్నట్లు చెప్పారు. ఇది దేశంలోనే మూడో ఫిషరీస్ వర్సిటీ అని వివరించారు. వర్సిటీ ఏర్పాటువల్ల మత్స్యరంగంలో విస్తృత పరిశోధనలు జరుగుతాయని, ఈ రంగంలో నిపుణుల కొరత కూడా తీరుతుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్‌పర్సన్ బర్రి లీల, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

8 ఆర్‌వోబీలకు లైన్‌క్లియర్

భూసేకరణ నిధులు విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైల్వేలైన్ల వద్ద లెవల్ క్రాసింగ్ సమస్య పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. అందుకోసం రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసేందుకు చొరవ చూపించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన 10 ఆర్‌వోబీల నిర్మాణానికి భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు రూ.106.18 కోట్లు విడుదల చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ రాష్ట్రానికి 33 ఆర్‌వోబీలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ ప్రాజెక్టు కింద దశలవారీగా చేపట్టే ఈ ఆర్‌వోబీల నిర్మాణానికి భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులను వెచ్చించాల్సి ఉంది. మొదటిదశలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) 10 ఆర్‌వోబీల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే రెండు ఆర్‌వోబీలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తాజాగా మిగిలిన 8 ఆర్‌వోబీల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటికి తన వాటా నిధులు రూ.106.18 కోట్లు విడుదల చేసింది. దీంతో ఆర్‌వోబీల నిర్మాణానికి మార్గం సుగమమైంది. పనులు వేగవంతం కానున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణాలను పూర్తిచేయాలనే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాచరణను వేగవంతం చేశాయి.

ఆర్‌వోబీలు నిర్మించనున్న ప్రాంతాలు

1.విశాఖపట్నం మార్షలింగ్ యార్డ్	4. పిడుగురాళ్ల
2. నిడదవోలు	5. దెందులూరు
3. పిఠాపురం	6. కమలాపురం
	7. టంగుటూరు
8. గూడూరు	

స్థానిక వార్తలు

మోరీని ఢీ కొన్న బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

సోమందేపల్లి: స్థానిక మణికంఠ కాలనీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న మోరీ రక్షణ గోడను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా శ్రీశైలం నుంచి 40 మంది ప్రయాణికులతో బెంగళూరుకు ప్రయాణికులతో వెళుతుండగా డ్రైవర్ నిద్రమత్తులో జోగడంతో బస్సు అదుపు తప్పి మోరీని ఢీకొంది. ఘటనలో 11 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బీజేపీకి అండగా నిలవండి

- జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, రాబోవు ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలనిఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురంలోని టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోదీ సారథ్యంలో దేశంలో జరిగిన అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవిరెడ్డి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ స్థల పరిశీలన

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరులో సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన స్థలంలో చేపట్టిన పనులను బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. త్వరలో జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితమివ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, చిరంజీవిరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

విహారయాత్ర జ్ఞాపకాల్లో ఉండగానే..

- రోడ్డు ప్రమాదంతో కకావికలు
- ఐచర్‌ను ఢీకొన్న ఓల్వో బస్సు
- బెంగళూరు నుంచి రాయచూరుకు వెళ్తుండగా పామిడి వద్ద దుర్ఘటన
- ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు ప్రయాణికులకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఓల్వో బస్సు



బోల్తా పడ్డ ఐచర్ వాహనం

పామిడి: థాయ్‌లాండ్‌లోని సముద్ర తీర ప్రాంతాల్లో విహరిస్తూ విలాసవంత హోటళ్లలో సరదాగా గడిపారు. ఆపై స్వస్థలాలకు బయల్దేరి ప్రమాదానికి గురయ్యారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో పామిడి వద్ద జాతీయ రహదారి–44పై బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఓల్వో బస్సు– ఐచర్ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటకలోని యాదగిరి జిల్లావాసి, ఓల్వో బస్సు డ్రైవర్ హబీబ్ ఖాన్ (60), ఐచర్ వాహనం డ్రైవర్, కర్నూలువాసి మధు(35) తీవ్ర రక్తగాయాలపాలయ్యారు. బస్సులో ప్రయాణిస్తున్న రాయచూరు పట్టణానికి చెందిన శిరీషా, లక్ష్మి, హరిప్రసాద్ గాయపడ్డారు.

ప్రమాదం జరిగిందిలా..

బెంగళూరు నుంచి ఎన్ఎల్ 01 బీ 1256 నంబర్ గల ఓల్వో బస్సు 25 మంది ప్రయాణికులతో రాయచూరుకు బయలుదేరింది. ఏపీ 21 టీసీ 1500 నంబర్‌గల ఐచర్ వాహనం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు గోనె సంచుల లోడ్‌తో వస్తోంది. గజరాంపల్లి గ్రామం వద్ద హైవేపై ఐచర్ డ్రైవర్ వాహనాన్ని నెమ్మది చేశాడు. వెనుకలే వేగంగా వస్తున్న ఓల్వో బస్సు అదుపు తప్పి ఐచర్‌ను ఢీకొంది. దీంతో ఐచర్ వాహనం బోల్తా పడింది. బస్సు రోడ్డుకు అడ్డంగా నిలబడిపోయింది. రెండు వాహనాల్లోనివారు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేశారు. ఐచర్ వాహన డ్రైవర్ మధు ఎడమ చెయ్యి విరిగి, రక్తగాయాలతో బయటపడ్డాడు. బస్సు డ్రైవర్, మరో ముగ్గురికి గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించారు. మరికొందరికి మూగదెబ్బలు తగిలాయి.

బ్యాంకాక్ టూర్‌కు వెళ్లి వస్తూ

రాయచూరుకు చెందిన ఫర్టిలైజర్ల డీలర్లు పదిరోజుల క్రితం తమ కుటుంబాలతో కలిసి థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌కు విహారయాత్రకు వెళ్లారు. టూరు ముగించుకొని బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగి ఓల్వో బస్సులో రాయచూరుకు తిరుగు పయనమయ్యారు. చివరకు ప్రమాదానికి గురై ఉదయం 7 గంటల వరకూ గజరాంపల్లి సంఘటనా స్థలంలో వేచి ఉన్నారు. తదుపరి వారు అద్దె కార్లలో రాయచూరుకు బయలుదేరి వెళ్లారు. పోలీసులు క్రేన్ సాయంతో బోల్తా పడ్డ ఐచర్‌ను, బస్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నేడు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ఎండీ అమృతరాజ్ తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటలకు ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళా పోలీస్/ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు/వార్డు ఉమెన్/వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీలకు అనంతపురం రెవెన్యూ భవన్‌లో, ఏఎన్ఎం/వార్డు హెల్త్ సెక్రటరీలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో, సర్వే అసిస్టెంట్లు/వీఆర్‌ఓలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు/పంచాయతీ సెక్రటరీలు(పీఎస్) గ్రేడ్–5/పంచాయతీ సెక్రటరీలు గ్రేడ్–6(డిజిటల్ అసిస్టెంట్లు)కు అనంతపురం రెవెన్యూ భవన్‌లో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. వికలాంగులు, స్పౌజ్, మెడికల్, ఒంటరి మహిళలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



మొక్కలు నాటుతున్న కుమార్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పాలక మండలి చైర్మన్ బండి మరియాకుమారెడ్డి అన్నారు. బుధవారం రేకులకుంటలోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానాన్ని ఆయన సందర్శించారు. పరిశోధనా స్థానంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటి వనరులతో మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పరిశోధనా స్థానంలో నూతన రకాల మామిడి, పనస, చింత మొక్కలను నాటారు. కార్యక్రమంలో వర్సిటీ పాలక మండలి సభ్యుడు కేశవరెడ్డి, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ దీప్తి, డాక్టర్ విమల, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- రూ.3.45 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితులు నలుగురూ తిరుపతి జిల్లా ఓజీకుప్పం గ్రామస్తులు



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: బ్యాంకుల వద్ద ప్రజలను ఏమార్చి నగదు అపహరించే నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను కళ్యాణదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బి.శ్రీనివాసులు, పట్టణ సీఐ తేజమూర్తి, ఎస్‌ఐలు నాగమధు, సుధాకర్, ఆశాబేగం వెల్లడించారు. ఈ నెల 1వ తేదీన కళ్యాణదుర్గంలోని గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షలు నగదును డిపాజిట్ చేసేందుకు వచ్చిన టీటీహెచ్ డీలర్ రవికుమార్ ద్విచక్రవాహనంలో నుంచి ఆయనకు తెలియకుండానే నగదును దుండగులు అపహరించుకెళ్లారు. అలాగే 9వ తేదీన బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లికి చెందిన రైతు చాకలి శంకరయ్య కళ్యాణదుర్గంలోని యూనియన్ బ్యాంక్‌లో పంట రుణం రెన్యువల్ కోసం రూ.1.45 లక్షలను తీసుకురాగా, ద్విచక్ర వాహనంలోని ఆ డబ్బును తెలివిగా దొంగలించారు. ఆయా ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం కళ్యాణదుర్గం సమీపంలో తచ్చాడుతున్న నలుగురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో బ్యాంకుల వద్ద నగదు అపహించుకెళ్లింది వారేనని తేలింది. పట్టుబడిన వారిలో తిరుపతి జిల్లా నగరి మండలం కావేటిపురం పంచాయతీలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన కుంచల సుబ్రమణ్యం, పసుపులేటి వినోద్, గోగుల తులసేందర్, పసుపులేటి రమేష్ ఉన్నారు. వీరి నుంచి రూ.3.45 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. కాగా, నిందితులపై గతంలో ప్రకాశం, తూర్పు గోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లా, హైదరాబాద్, కర్ణాటకలోని బీదర్, తమిళనాడులోని తిరుత్తణి, కాంచీపురంలో కేసులు నమోదయ్యాయి. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

యువకుడి దారుణ హత్య

- మద్యం మత్తులో గొడవ
- పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ
- కత్తితో దాడి చేయబోయి ప్రత్యర్థి చేతిలో హతం



బాబాఫక్రుద్దీన్ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: దారిన వెళుతున్న వ్యక్తితో మద్యం మత్తులో గొడవ పడి, కత్తితో దాడిచేయబోయిన ఓ యువకుడు ప్రత్యర్థి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని పోరాట కాలనీ ప్రధాన రహదారి పక్కనే బహిరంగ ప్రదేశంలో మంగళవారం అర్ధరాత్రి అదే ప్రాంతానికి చెందిన బాబాఫక్రుద్దీన్ (33) మరో ఇద్దరితో కలసి మద్యం సేవిస్తున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన వినోద్‌కుమార్‌ను పిలిచి దుర్భాషలాడడంతో వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారి తీసింది. అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న కత్తితో వినోద్‌పై బాబాఫక్రుద్దీన్ దాడికి దిగాడు. ప్రమాదాన్ని పసిగట్టిన వినోద్ దాడి నుంచి తప్పించుకుని కత్తిని లాక్కొని వెంటనే బాబా ఫక్రుద్దీన్ గొంతులో బలంగా పొడిచాడు. దీంతో బాబా ఫక్రుద్దీన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బాబా ఫక్రుద్దీన్‌తో ఉన్న వారు రాళ్లు రువ్వడంతో వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాతకక్షలే కారణమా?

పాత కక్షల నేపథ్యంలోనే బాబా ఫక్రుద్దీన్ హతమైనట్లుగా తెలుస్తోంది. 2013లో వినోద్‌కుమార్, బాబా ఫక్రుద్దీన్, సిద్దు మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో వినోద్‌పై బాబా ఫక్రుద్దీన్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనపై అప్పట్లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ దశలో కక్షిదారులు రాజీ కావడంతో ఈ కేసును న్యాయస్థానం కొట్టేసినట్లుగా సమాచారం. అప్పటి నుంచి అవకాశందొరకబుచ్చుకుని ఏదో ఒక రూపంలో వినోద్‌ను బాబా ఫక్రుద్దీన్ రెచ్చగొట్టేవాడుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో వినోద్‌ను కత్తితో పొడవబోయి, అదే కత్తితో హతం కావడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

నేడు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం క్రైం: నగర పాలక సంస్థ కార్యాలయంలోని నూతన మీటింగు హాలులో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్, ప్లానింగ్, అమినిటీ కార్యదర్శులు హాజరుకావాలని సూచించారు. వికలాంగులు, స్పౌజ్, మెడికల్, ఒంటరి మహిళ వారికి మాత్రమే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 85	63,229	
నిఫ్టీ ▲ 40	18,756	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,592	▲	19
డోజోన్స్	34,052	▼	160
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,602	▲	8
డాక్స్	16,312	▲	90
షాంఘై	3,229	▼	5
నికాయ్	33,502	▲	484

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో – ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,264	▼	592
బంగారం (99.5 స్వచ్ఛత)	59,027	▼	589
వెండి (కిలో)	72,105	▼	1,064

ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణం

వోల్వో నుంచి కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ | సీ40 రీచార్జ్ ఈవీ విడుదల | 27 నిముషాల్లో 80% చార్జింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న స్వీడన్ సంస్థ వోల్వో తాజాగా భారత మార్కెట్లో పూర్తి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సీ40 రీచార్జ్ ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. ట్విన్ మోటార్స్, 408 హెచ్‌పీ పవర్‌తో 78 కిలో వాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 4.8 సెకన్లలో చేరుకుంటుంది. 27 నిమిషాల్లో 80 శాతం చార్జింగ్ పూర్తి అవుతుంది. కారుకు కావాల్సిన విడిభాగాలను భారత్‌కు దిగుమతి చేసుకుని బెంగళూరు ప్లాంటులో అసెంబుల్ చేస్తారు. సెప్టెంబర్ నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ఎలక్ట్రిక్ విభాగంలో భారత్‌లో సంస్థకు ఇది రెండవ మోడల్. ఇప్పటికే ఇక్కడి విపణిలో పూర్తి ఎలక్ట్రిక్ ఎక్స్‌సీ40 రీచార్జ్ కారును గతేడాది ప్రవేశపెట్టింది. అంతర్జాతీయంగా 2030 నాటికి పూర్తి ఎలక్ట్రిక్ కార్ కంపెనీగా అవతరించాలన్నది వోల్వో లక్ష్యం. భారత్‌లో 2025 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించింది.

ఈవీలదే కీలక పాత్ర..

వోల్వో 2022లో దేశవ్యాప్తంగా సుమారు 1,800 యూనిట్లను విక్రయించింది. ఇప్పటి వరకు కంపెనీ నుంచి గరిష్టంగా 2018లో 2,600 కార్లు రోడ్డెక్కాయి. ఏటా ఇక్కడి మార్కెట్లో ఒక ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ ఏడాది భారత్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు సాధించే ప్రయత్నంలో ఎలక్ట్రిక్ కార్లు కీలక పాత్ర పోషిస్తాయని వోల్వో కార్ ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు. '2023 చాలా ఆశాజనకంగా ప్రారంభమైంది. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే 2023లో మరింత మెరుగ్గా రాణిస్తామని నమ్ముతున్నాం. మహమ్మారి కారణంగా మార్కెట్ కొంచెం నెమ్మదిగా ఉంది. అలాగే సరఫరా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ సమస్య ఇప్పటికీ ఉంది. గరిష్ట స్థాయి అమ్మకాలను సాధించిన 2018 స్థాయికి ఈ ఏడాది చేరుకుంటాం. మొత్తం విక్రయాల్లో ఈవీల వాటా 27 శాతం ఉంది' అని వివరించారు. కంపెనీ భారత్‌లో ఎక్స్‌సీ90, ఎక్స్‌సీ60, ఎక్స్‌సీ40 ఎస్‌యూవీలు, ఎస్90 సెడాన్‌ను సైతం విక్రయిస్తోంది.

సీడీఎస్‌ఎల్‌లో బీఎస్‌ఈ వాటాల విక్రయం

రూ. 468 కోట్లకు 4.5% అమ్మకం



న్యూఢిల్లీ: సెంట్రల్ డిపాజిటరీస్ సర్వీసెస్ ఇండియా (సీడీఎస్‌ఎల్)లో స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్‌ఈ మరో 4.5 శాతం వాటాలను విక్రయించింది. ఈ డీల్ విలువ రూ. 468 కోట్లు. షేరు ఒక్కింటికి సగటున రూ. 985.98 రేటు చొప్పున ఓపెన్ మార్కెట్లో 47,44,000 షేర్లను బీఎస్‌ఈ విక్రయించింది. ఎలక్ట్రానిక్ విధానంలో షేర్ల లావాదేవీల నిర్వహణ తదితర సర్వీసులను సీడీఎస్‌ఎల్ అందిస్తోంది. దేశీయంగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన ఏకైక డిపాజిటరీగా కొనసాగుతోంది. సీడీఎస్‌ఎల్ 2017లో లిస్టయ్యింది. అప్పట్లో బీఎస్‌ఈకి కంపెనీలో 50.05 శాతం వాటాలు ఉండేవి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం డిపాజిటరీల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలకు 24 శాతానికి మించి వాటాలు ఉండకూడదు. దీంతో నిబంధనలకు అనుగుణంగా ఐపీవో కింద కొన్ని షేర్లను విక్రయించడం ద్వారా బీఎస్‌ఈ తన వాటాను తగ్గించుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో 2.5 శాతం వాటాలను విక్రయించింది.

ఎన్‌ఎస్‌ఈలో సీడీఎస్‌ఎల్ షేరు బుధవారం 3% క్షీణించి రూ. 1,018 వద్ద క్లోజయ్యింది.

కంటి సమస్యలకు 'లీ' ఔషధం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చూపు మందగించడం, కంటికి వచ్చే అంటువ్యాధులకు పరిష్కారంగా ఫార్మా కంపెనీ లీ హెల్త్ డొమెయిన్ 'డీ–మాక్యులా' పేరుతో సహజ సిద్ధ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చింది. అశ్వగంధ, బోస్విల్లా శరాషియో, జీగ్జాంథిన్, త్రిఫల, బీటా కెరోటిన్, కుంకుమ పువ్వును దేశీయ ఆవు నెయ్యిలో మరిగించి సేకరించిన రసాయనంతో డీ–మాక్యులా సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్ తయారైందని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కంటి మంట, పొడిబారడం, హానికర నీలి కాంతికి వ్యతిరేకంగా పోరాడడానికి, డయాబెటిక్ రెటినోపతి చికిత్సలో సహాయకారిగా ఉంటుందన్నారు. అమెజాన్, లీహెల్త్‌డొమెయిన్.కామ్ ద్వారా కూడా లభిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
15-6-2023	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	490-00
రిటైల్ ధర (డజను)	72.00
14-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ
- ఫెడ్ వడ్డీరేట్ల ప్రకటన ముందు అప్రమత్తత
- ద్వితీయార్థం నుంచి కొనుగోళ్లు
- రాణించిన మెటల్, ఇంధన షేర్లు
- సూచీలు మూడో రోజూ ముందడుగే



ముంబై: మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడే నష్టాల నుంచి కోలుకున్న సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మెటల్, కమోడిటీ, ఇంధన షేర్లు రాణించడంతో పాటు టోకు ద్రవ్యోల్బణం ఏడున్నరేళ్ల కనిష్టానికి దిగిరావడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 28 పాయింట్ల నష్టంతో 63,115 వద్ద, నిఫ్టీ 28 లాభంతో 18,744 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల వెల్లడి(బుధవారం రాత్రి)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 260 పాయింట్లు పరిధిలో 63,014 వద్ద కనిష్టాన్ని, 63,274 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 85 పాయింట్లు బలపడి 63,229 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్ల రేంజ్ కదలాడింది. రోజంతా 18,690 – 18,770 శ్రేణిలో ట్రేడైంది.ఆఖరికి 40 పాయింట్లు పెరిగి 18,756 వద్ద నిలిచింది. మెటల్, ఇంధన, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లు లాభపడ్డాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.42%, 0.20శాతం చొప్పున పెరిగాయి. మరో వైపు బ్యాంక్స్, మీడియా, ఫైనాన్స్, ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,715 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.655 కోట్ల షేర్లను విక్రయించాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 82.10 వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ ప్రకటన వెల్లడి ముందు ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కారణాలతో దేశీయ ఈక్విటీ మార్కెట్లో ఇప్పటికీ సానుకూలత సంకేతాలు నెలకొని ఉన్నాయి. ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్‌లు నేడు(గురువారం) పాలసీ విధాన వైఖరిని ప్రకటించనున్నాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను పెంచకుండా యథాతథ కొనసాగింపునకే మొగ్గుచూపితే సూచీలు ఆల్‌టైం హైని పరీక్షించవచ్చు'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

టోకు ధరలు దిగివచ్చాయ్..!

- మేలో ఏడున్నర ఏళ్ల కనిష్టానికి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం
- పెరుగుదల లేకపోగా 3.48% క్షీణత
- ఆహార, తయారీ, ఇంధన ధరల తగ్గుదల కారణం



ప్రతి ద్రవ్యోల్బణం... వరుసగా రెండో నెల

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెల్లో పెరుగుదల లేకపోగా 3.48 శాతం (క్షీణత) తగ్గింది. గడచిన ఏడు సంవత్సరాల్లో (2015 నవంబర్‌లో మైనస్ 3.7 శాతం) ఈ స్థాయిలో టోకు ధరలు నమోదుకావడం ఇదే తొలిసారి. హైబేస్ ఎఫెక్ట్‌తోపాటు (గత ఏడాది మే నెల్లో భారీ టోకు ద్రవ్యోల్బణం నమోదుకావడం) సూచీలో మూడు ప్రధాన విభాగాలైన– ఆహార, తయారీ, ఇంధన ధరలు పూర్తిగా అదుపులోనికి వచ్చాయి. 2022లో మే నెలలో 16.63 శాతం టోకు ద్రవ్యోల్బణం (హైబేస్) నమోదుకావడం ఇక్కడ గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మేనెల్లో 25 నెలల కనిష్ఠం 4.25 శాతంగా నమోదయిన సానుకూల ఫలితం నేపథ్యంలోనే టోకు ధరలకు సంబంధించి కూడా ఎకానమీకి ఊరటనిచ్చే తాజా ఫలితం వెలువడింది. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన తాజా గణాంకాలను పరిశీలిస్తే...

- ఏప్రిల్‌లో ఫుడ్ ఆర్టికల్స్ ధరల 3.54 శాతం తగ్గితే (వార్షికంగా పోల్చి) తాజా సమీక్షా నెల్లో తగ్గుదల 1.51 శాతంగా ఉంది. కూరగాయల ధరలు 20.12 శాతం తగ్గాయి. ఆలూ ధరలు 18.71%, ఉల్లిధరలు 7.25% తగ్గాయి. అయితే పప్పు దినుసుల ధరలు మాత్రం 5.76 % ఎగశాయి. గోధుమలకు సంబంధించి ద్రవ్యోల్బణం కూడా 6.15%గా ఉంది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్ ద్రవ్యోల్బణం మేలో 9.17 శాతం (మైనస్) తగ్గింది. ఏప్రిల్ నెలలో 0.93 శాతంగా ఉంది.
- తయారీ ఉత్పత్తుల ధరలు ఏప్రిల్‌లో మైనస్ 2.42 శాతంగా ఉంటే, మేలో మైనస్ 2.97 శాతంగా నమోదయ్యింది.

ద్రవ్యోల్బణం మైనస్ లోకి వెళ్లడాన్ని... సాంకేతికంగా ప్రతి ద్రవ్యోల్బణం అని పిలుస్తారు. ఈ ప్రాతిపదికన ప్రతి ద్రవ్యోల్బణం నమోదుకావడం వరుసగా ఇది రెండవనెల. ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 1.51%గా నమోదయ్యింది. రానున్న నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగితే, బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపో 2023లో యథాతథంగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. 2022 మే తర్వాత 2.50% పెరుగుదలతో 6.5 శాతానికి చేరిన రెపో రేటును గత రెండు ద్వైమాసిక సమీక్షల సందర్భంగా ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపులోనికి రావడమే దీనికి కారణం.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

డీఆర్‌డీవో సైంటిస్ట్.. నెలకు లక్ష వేతనం

దేశ రక్షణకు సంబంధించిన కీలక పరిశోధనలు సాగించే.. డీఆర్‌డీఓలో అడుగుపెట్టే అద్భుత అవకాశం! బీటెక్, ఎమ్మెస్సీ అర్హతలతో.. గేట్ స్కోర్ ఆధారంగా.. ఈ ప్రతిష్టాత్మక సంస్థలో సైంటిస్ట్ పోస్టు సొంతం చేసుకోవచ్చు!! ఇటీవల డీఆర్‌డీఓ 181 సైంటిస్ట్-బి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం.. డీఆర్‌డీఓకు చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్.. నియామక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. డీఆర్‌డీఓ సైంటిస్ట్-బి పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, భవిష్యత్తు కెరీర్ తదితర అంశాలపై విశ్లేషణ..

» సైంటిస్ట్-బి హోదాలో 181 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» బీటెక్, సైన్స్ పీజీ, గేట్ స్కోర్‌తో దరఖాస్తుకు అర్హత



డీఆర్‌డీఓ జాబ్స్

మొత్తం పోస్టుల సంఖ్య: 181

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్.. డీఆర్‌డీఓ. ఈ సంస్థ.. మొత్తం 181 సైంటిస్ట్-బి పోస్టుల భర్తీకి నియామకాలు చేపడుతోంది. ఇందులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-49 పోస్టులు, మెకానికల్ ఇంజనీరింగ్-44, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-34,ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-5, మెటీరియల్ ఇంజనీరింగ్ /మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/మెటలర్జికల్ ఇంజనీరింగ్-10, ఫిజిక్స్-10, కెమిస్ట్రీ-5, కెమికల్ ఇంజనీరింగ్-13, ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్-7,మ్యాథమెటిక్స్-2, సివిల్ ఇంజనీరింగ్-2.

అర్హత

- సంబంధిత ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో ప్రథమ శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్)లో సంబంధిత పేపర్‌లో స్కోర్ సాధించాలి.
- మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సంబంధించి సంబంధిత సబ్జెక్ట్‌లో ప్రథమ శ్రేణిలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్ట్ 31 నాటికి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.
- వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి.. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్‌సీ/ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు ఉండాలి.

గేట్ స్కోర్

అభ్యర్థులు సంబంధిత బీటెక్, పీజీ కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు తాము దరఖాస్తు చేసుకునే విభాగానికి సంబంధించిన గేట్ సబ్జెక్ట్‌లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. గేట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. ఆయా విభాగాలకు సంబంధించి.. గేట్ స్కోర్ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున(1:10 నిష్పత్తిలో) పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

ఇంటర్వ్యూలో అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తిని, రక్షణ రంగంలో పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తల బృందం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. కాబట్టి అభ్యర్థులు దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇటీవల కాలంలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలపై పట్టు సాధించాలి.

వెయిటేజీ విధానం

సైంటిస్ట్-బి పోస్ట్‌లకు సంబంధించి నియామకాలను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. గేట్ స్కోర్‌కు 80 శాతం, ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. అంతిమంగా ఈ రెండింటినీ క్రోడీకరించి తుది విజేతలను ప్రకటిస్తారు.

శిక్షణ

సైంటిస్ట్-బి హోదాలో నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ముందుగా.. అయిదు నెలలపాటు శిక్షణనిస్తారు. పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో ఈ ట్రైనింగ్ ఉంటుంది. ఈ సమయంలో వీరిని ఆఫీసర్ ట్రైనీగా పిలుస్తారు. దీనినే ఇండక్షన్ ప్రోగ్రామ్‌గానూ వ్యవహరిస్తారు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. డీఆర్‌డీఓ సైంటిస్ట్-బిగా ఉజ్వల కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

రూ.లక్షకు పైగానే వేతనం

'సైంటిస్ట్-బి' హోదాతో..గ్రూప్-ఎ టెక్నికల్ స్థాయిలో ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు..తమ పని తీరు, ప్రతిభ ఆధారంగా.. భవిష్యత్తులో డిఫెన్స్ ఆర్ అండ్ డీ సెక్రటరీ, చైర్మన్‌ల స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వీరికి తొలుత సైంటిస్ట్-సిగా పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత సైంటిస్ట్- డి, ఈ, ఎఫ్, జి స్థాయిలకు చేరుకోవచ్చు. అనంతరం సైంటిస్ట్-హెచ్ హోదాతో ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌గా ఉన్నత స్థాయి అందుకోవచ్చు. ఈ హోదాలో చూపిన ప్రతిభ ఆధారంగా డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్, ఆ తర్వాత డిఫెన్స్ ఆర్ అండ్ డీ సెక్రటరీ, చైర్మన్ స్థాయి వరకు ఎదగొచ్చు. సైంటిస్ట్-బి కొలువులో చేరిన వారికి ప్రారంభంలోనే రూ.56,100 -రూ.1,77, 500 వేతన శ్రేణిలో నెలకు రూ.లక్ష వేతనం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం:ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ అందుబాటులోకి రానుంది.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ అందుబాటులోకి వచ్చిన 21 రోజుల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://rac.gov.in

సశస్త్ర సీమాబల్‌లో 1656 కొలువులు

కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సశస్త్ర సీమాబల్ 1656 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనుంది. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్షలో ప్రతిభ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులను దేశంలో ఎక్కడైనా లేదా దేశం వెలుపలా నియమించే అవకాశం ఉంది. ఆయా పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 1656
- పోస్టుల వివరాలు: సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టులు-111 , అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (పారామెడికల్)-30, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్)-40, హెడ్‌కానిస్టేబుల్ -914 , కానిస్టేబుల్ పోస్టులు-543 తోపాటు అసిస్టెంట్ కమాండెంట్(వెటర్నరీ) 18 పోస్టులు ఉన్నాయి.

సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు-అర్హతలు

- సబ్ ఇన్‌స్పెక్టర్(పయనీర్): సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు 30 ఏళ్ల లోపు ఉండాలి.
- సబ్ ఇన్‌స్పెక్టర్(డ్రాఫ్ట్స్‌మెన్): మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల ఐటీఐ నేషనల్ ట్రేడ్స్‌మెన్ సర్టిఫికేట్ ఉండాలి. ఆటోక్యాడ్‌లో ఏడాది సర్టిఫికేట్ కోర్సు పూర్తిచేయాలి లేదా ఆటో క్యాడ్‌లో ఏడాది అనుభవం ఉండాలి. డ్రాఫ్ట్స్‌మ్యాన్‌షిప్‌లో ఏడాది అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- సబ్ ఇన్‌స్పెక్టర్(కమ్యూనికేషన్):ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేయాలి. గరిష్ట వయసు 30ఏళ్లు.
- సబ్ ఇన్‌స్పెక్టర్(స్టాఫ్‌నర్స్) ఫీమేల్: సైన్స్ సబ్జెక్టుతో 10+2/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. జనరల్ నర్సింగ్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తి చేయాలి. సెంట్రల్/స్టేట్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి. రెండేళ్ల అనుభవం తప్పనిసరి. వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- వయసు: ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు 5 నుంచి 10 ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌ఈ), రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సబ్-ఇన్‌స్పెక్టర్(కమ్యూనికేషన్) పోస్టుకు మాత్రమే పీఈటీ నిర్వహిస్తారు. 1.6 కిలో మీటర్ల పరుగును పురుష అభ్యర్థులు 6 నిమిషాల 30 సెకన్లలో ముగించాలి. మహిళా అభ్యర్థులు 800 మీటర్ల రేసును 4 నిమిషాల్లో ముగించాలి. ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పీఈటీ లేదు. వీరు పీఎస్‌టీ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌లకు హాజరుకావాలి.

రాత పరీక్ష ఇలా

పీఈటీ, పీఎస్‌టీ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులను రాత పరీక్ష(కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు ఎంపిక చేస్తారు. దీన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. రాత పరీక్ష రెండు పార్ట్‌లుగా 150 ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- పార్ట్-1: ఈ పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్, మ్యాథమేటిక్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ /జనరల్ హిందీ 50 మార్కులకు ఉంటాయి.
- పార్ట్-2: ఈ పార్ట్‌లో టెక్నికల్ సబ్జెక్టుకు 100 మార్కులుంటాయి.

రాత పరీక్షకు సంబంధించి జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులు 50 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 45 శాతం మార్కులు పొందాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు.

తుది ఎంపిక

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టులను నిర్వహిస్తారు. పోస్టుల సంఖ్యకు మూడు రెట్ల మంది అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌కు పిలుస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్ ఇలా

తొలుత పరీక్ష విధానంపై అవగాహన పెంచుకోవాలి. దానికి అనుగుణంగా టైమ్ టేబుల్ ప్రిపేర్ చేసుకోవాలి. టెక్నికల్ సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. కాబట్టి అభ్యర్థులు తాము ఐటీఐలో చదివిన టెక్నికల్ అంశాలపై పట్టు సాధించాలి. ప్రశ్నల సరళిని తెలుసుకునేందుకు గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. అలాగే వీలైనన్నీ ఎక్కువ మాక్‌టెస్టులను రాయాలి. తద్వారా వేగం, టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

- అర్హతలు: పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



పోలీస్ జాబ్స్

- వయసు: హెచ్‌సీ(మెకానిక్) పోస్టుకు 21-27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంట్ అభ్యర్థులకు 40 నుంచి 45 ఏళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది.
- ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

పోలీస్ కానిస్టేబుల్

- అర్హతలు: డ్రైవర్ పోస్టుకు పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వయసు 21-27 ఏళ్ల మధ్య ఉండాలి. వెటర్నరీ పోస్టుకు సైన్స్ ప్రధాన సబ్జెక్టుగా పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వెటర్నరీ హాస్పిటల్‌లో ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి. వయసు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్ పోస్టులకు పదోతరగతి/తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి. లేదా ఏడాది వ్యవధి ఉన్న ఐటీఐ సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేయాలి. లేదా రెండేళ్ల ఐటీఐ డిప్లొమా ఉండాలి. ట్రేడ్ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. వాషర్‌మ్యాన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్ అండ్ వాటర్ కేరియర్ పోస్టులకు టెన్త్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. రెండేళ్ల పని అనుభవం/ఐటీఐ ఏడాది సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి. లేదా రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. ట్రేడ్ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. మల్టీస్కిల్డ్ వ్యక్తులకు ప్రాధాన్యమిస్తారు.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

పీఈటీలో అర్హత సాధించిన అభ్యర్థులను పీఎస్‌టీకి ఎంపిక చేస్తారు. ఇందులోనూ అర్హత పొందిన వారికి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ) నిర్వహిస్తారు. వ్యవధి రెండు గంటలు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, మ్యాథమెటిక్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ /జనరల్ హిందీ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 18.06.2023
- వెబ్‌సైట్: http://ssbrectt.gov.in

పేదలనూ పిండుకున్న 'పసుపు రాబందులు'

వెలుగులోకి టీడీపీ కార్పొరేటర్లు, వారి అనుచరుల మోసాలు

- జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి వసూళ్లు
- నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో నమ్మించి మోసం
- రెండు వేల మందికి పైగా బాధితులు.. రూ.70 కోట్లు వసూలు చేసినట్లు అంచనా
- విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో అత్యధికంగా బాధితులు
- స్పందనలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు


సింగ్‌నగర్ వాంబే కాలనీ రోడ్డులో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

విజయవాడ చిట్టినగర్‌కు చెందిన నొక్కాజు మల్లేశ్వరరావు కార్పెంటర్. అతనికి జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎం) పథకంలో ఇల్లు ఇప్పిస్తానని విజయవాడ 47వ డివిజన్ టీడీపీ నాయకుడు మాకిన విజయ్‌కుమార్ నమ్మబలికాడు. ఐదేళ్ల క్రితం మల్లేశ్వరరావు నుంచి రూ.1.60 లక్షలు వసూలు చేశాడు. ఇప్పటికీ ఇల్లు ఇప్పించలేదు. విజయ్‌కుమార్ చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

విజయవాడ చిట్టినగర్‌లో బండిపై పూసలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చే తమ్మన మాధవికి ఇల్లు ఇప్పిస్తానని విజయ్‌కుమార్ రూ. 3.20 లక్షలు వసూలు చేశాడు. ఇల్లు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో విసిగి వేసారిన బాధితురాలు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల పేరిట జరిగిన భారీ మోసంలో చిన్న ఉదాహరణలు. ఇలా మోసపోయిన వారు నగరంలో 2 వేల మంది ఉన్నట్లు అంచాన. 2014 నుంచి 2019 వరకు జరిగిన ఈ దందా బాధితుల ఫిర్యాదులతో ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. దాదాపు రూ. 70 కోట్లు పేదల నుంచి వసూలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో టీడీపీ నాయకులు మోసం చేశారని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదుల్లో బాధితులు పేర్కొన్నారు.రోడ్లు, కాలువలు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో నివాసం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నిర్ణయించాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ పథకం పనులు 2014 వరకు నిర్విరామంగా కొనసాగాయి. విజయవాడ నగరంలో ఇళ్లు కోల్పోయిన పేదల కోసం నగరంలోని జక్కంపూడి, ఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్, కబేలా ప్రాంతాల్లో వంద ఎకరాల్లో 28,152 జీ ప్లస్ త్రి గృహాల నిర్మాణం జరిగింది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. అయితే అప్పటివరకు నిర్మించిన ఇళ్లను కేటాయించేందుకు నిర్ణయించింది. దీంతో విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు ఈ ఇళ్లను యథేచ్ఛగా అమ్మేశారు. ఆ నియోజకవర్గాలకు అప్పట్లో ఎమ్మెల్యేలుగా ఉన్న టీడీపీ నాయకులు జలీల్‌ఖాన్, బొండా ఉమామహేశ్వరరావు కనుసన్నల్లోనే ఈ బాగోతం జరిగినట్లు తెలుస్తోంది. ఉచితంగా ఇవ్వాల్సిన ఈ ఇళ్లను డివిజన్లలో టీడీపీ నాయకులు ఒక్కొక్కరూ 200 గృహాలు అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. దీంతో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు ఒక్కో ఇంటికి రూ. 1.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వసూలు చేసి వారు రూ. కోట్లు దండుకున్నారు.

నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు

జక్కంపూడి, సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట, కబేలా ప్రాంతాల్లో జేఎన్ఎన్ఆర్‌యుఎం ఇళ్ల కేటాయింపు 2018లోనే పూర్తయింది. అయినా, టీడీపీ నాయకులు నకిలీ డాక్యుమెంట్లు, మునిసిపల్, బ్యాంకు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేశారు. ఇళ్లు లేకపోయినా ఉన్నట్లు ప్రచారం చేసి పేదల నుంచి వసూళ్లు చేశారు. పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 41 డివిజన్లలో ఈ తరహా బాధితులు 2 వేల మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరి నుంచి రూ. 60 నుంచి రూ.70 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. చాలా మంది బాధితులు ముందుగా కొత్తపేట (టుటౌన్) పోలీసులను ఆశ్రయిస్తున్నాయి. అక్కడా విజయ్‌కుమార్ మాటే చెల్లుబాటు కావడంతో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటివరకు మాకిన విజయ్‌కుమార్ బాధితులు 35 మంది ఇప్పటివరకు పోలీసులను ఆశ్రయించారు. ఇతనితోపాటు 41వ డివిజన్‌లోని నాగోతు రామారావు, 57వ డివిజన్‌లోని ఎడిబోతు రమణ, 58వ డివిజన్‌లోని సోమేశ్వరరావు, రామారావు, 60వ డివిజన్‌లోని భువట ఉమా, శ్రీరాములు, 63వ డివిజన్‌లోని పైడి శ్రీను పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, విజయవాడ



వాళ్లంతే..

చెప్పులేసుకోరు

ఆ ఊరికి కలెక్టర్ వెళ్లినా చెప్పులు వదిలేయాల్సిందే

- ఎంత ఆకలి వేసినా బయట తిండి తినరు
- జబ్బొచ్చినా ఆస్పత్రికి వెళ్లరు
- మేమింతే అంటున్న 'వేమన ఇండ్లు' వాసులు

సాక్షి, తిరుపతి: ఇంట్లో సైతం పాదరక్షలు ధరించి తిరుగుతున్న ఈ రోజుల్లో.. ఆ ఊరి వాసులు ఎక్కడికి వెళ్లినా చెప్పులు ధరించరు. ఆకలేస్తే ఏదో ఒకటి తిని కడుపు నింపుకుంటున్న ప్రస్తుత తరంలో.. ఆ ఊరి వాళ్లు బయటి ప్రాంతాలకు వెళితే మంచినీళ్లు కూడా ముట్టరు. ఆచారాలు, సంప్రదాయాలకు విలువనిచ్చే ఆ గ్రామం పేరు 'వేమన ఇండ్లు'. తిరుపతి జిల్లా పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో ఉంది. వేమన ఇండ్లు గ్రామంలో ఉంటున్న వారంతా 'పాలవేకరి' కులస్తులుగా, దొరవార్లుగా చెప్పుకుంటున్నారు. వీరంతా బీసీ జాబితాలో ఉన్నారు. వీరి ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి. గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో రోజుకో కుటుంబం పూజలు చేస్తుంది. గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి, గంగమ్మను కూడా పూజిస్తారు.

విలువలు.. కట్టుబాట్లకు పెద్దపీట

ఈ ఊళ్లో ఉన్న అందరూ ఒకే వంశం వారు. తమ కులం వారితో మాత్రమే వీరు సంబంధాలు కలుపుకుంటున్నారు. వేమన ఇండ్లు గ్రామానికి ఎవరొచ్చినా.. ఊరి బయటే చెప్పులు విడిచి గ్రామంలోకి అడుగుపెట్టాలి. ఇంట్లోకి వెళ్లాలంటే తప్పనిసరిగా స్నానం చేయాల్సిందే. లేదంటే ఇంటి బయటే ఉండాలి. కలెక్టర్ అయినా గ్రామ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందేనని స్థానికులు తేల్చిచెబుతున్నారు. ఈ గ్రామస్తులు ఎన్ని వందల కిలోమీటర్ల దూరం వెళ్లినా చెప్పులు మాత్రం ధరించరు. శ్రీ వెంకటేశ్వరుడిపై భక్తితో పాదరక్షలు ధరించడం మానేశామని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే వారు సైతం చెప్పులు లేకుండానే వెళ్లివస్తారు. ఒకరిద్దరు ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా గ్రామ ఆచార సంప్రదాయాలను తప్పక పాటిస్తున్నారు.

బయట తిండి ముట్టరు

వేమన ఇండ్లకు చెందిన వారు ఏదైనా పనిమీద వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే.. బయట తిండి ముట్టరు. మంచినీరు కూడా తీసుకోరు. ఇంటి నుంచే క్యారియర్‌లో భోజనం, బాటిల్లో మంచినీరు తీసుకెళ్తారు. విద్యార్థులు స్కూల్లో పెట్టే మధ్యాహ్న భోజనం కూడా ముట్టరు. బయటి నుంచి ఇంటికి వచ్చినా.. స్నానం చేసి బట్టలు మార్చుకోనిదే గడప తొక్కరు. అది కూడా చన్నీళ్ల స్నానమే. చిన్నారులైనా చన్నీటితోనే స్నానం చేయిస్తారు. బంధువులు ఇంటికి వచ్చినా.. గ్రామంలో ఈ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందే.

ఆ వారం రోజులు మహిళలు ఊరి బయటే

నెలసరి మహిళల కోసం ఊరికి అవతల ప్రత్యేకంగా రెండు పక్కా గృహాలు నిర్మించారు. పీరియడ్స్ వచ్చిన మహిళలు వారం రోజులపాటు వాటిలోనే ఉండాలి. అప్పటివరకు ఇంటి యజమానే వంట వార్పు చేస్తారు. వంటచేసి భార్యకు తీసుకెళ్లి ఇచ్చి వచ్చేస్తారు.

ఆస్పత్రుల మొహం ముఖం చూడలేదు

గ్రామస్తులకు జబ్బు చేసినా.. చివరకు పాము కరచినా ఆస్పత్రికి వెళ్లరు. పాము కరిస్తే పుట్టచుట్టూ తిరిగితే నయం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గర్భిణులు సైతం ఆస్పత్రిలకు వెళ్లిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలోనూ వీరెవరూ ఆసుపత్రికి వెళ్లలేదు. కోవిడ్ వ్యాక్సిన్ కూడా వేసుకోలేదని చెబుతున్నారు.

ఇప్పుడిప్పుడే పక్కా గృహాలొస్తున్నాయ్

నాలుగేళ్లుగా ఆ గ్రామస్తులకు రేషన్ సరఫరా చేస్తున్నాను. గతంలో ఈ ఊర్లో పక్కా గృహాలే లేవు. తడికలు ఏర్పాటు చేసుకుని దానిపై పట్టా కప్పుకుని జీవించేవారు. టీడీపీ హయాంలో ఒకే ఒక్క ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం 12 ఇల్లు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చింది. – బాబురెడ్డి, రేషన్ డీలర్



ఫోన్లలో పాస్‌వర్డ్‌లు జాగ్రత్త!

మొబైల్స్‌లోనే భద్రపర్చుకుంటున్న 17 శాతం మంది పౌరులు

- కుటుంబ సభ్యులు, సన్నిహితులతో వాటిని పంచుకుంటున్న వారు 30 శాతం..
- లోకల్ సర్కిల్ సర్వేలో వెల్లడి
- దేశవ్యాప్తంగా 337 జిల్లాల్లో 32 వేల మంది నుంచి వివరాల సేకరణ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ప్రతి చిన్న లావాదేవీని ప్రజలు ఆన్‌లైన్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చేస్తున్నారు. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీల పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోలేక కొందరు మొబైల్ ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. 17 శాతం మంది పౌరులు బ్యాంకు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వంటి ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను తమ మొబైల్‌లో కాంటాక్ట్ లిస్ట్/నోట్స్‌లో భద్రపర్చుకుంటున్నారు. ఈ విషయం లోకల్ సర్కిల్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఆర్థిక డేటా భద్రతపై దేశవ్యాప్తంగా 337 జిల్లాల్లో 32 వేల మందిని సర్వే చేశారు. ఈ క్రమంలో.. ఏటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇతర ఆర్థిక లావాదేవీల పాస్‌వర్డ్‌లను ఎక్కడ స్టోర్ చేసుకుంటారని 11,236 మందిని ప్రశ్నించారు. వీరిలో..

- తొమ్మిది శాతం మంది ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్‌లో, ఎనిమిది శాతం మంది ఫోన్ నోట్స్‌లో స్టోర్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు.
- ఏడు శాతం మంది మొబైల్ ఫోన్‌లోని వివిధ యాప్‌లలో పాస్‌వర్డ్‌లను సేవ్ చేస్తున్నామన్నారు.
- 14 శాతం మంది మాత్రం గుర్తు ఉంచుకుంటున్నట్లు తెలిపారు.
- 18 శాతం మంది ల్యాప్‌టాప్/కంప్యూటర్‌లో, 39 శాతం మంది మొబైల్ ఫోన్‌తో సంబంధం లేకుండా వేరే మార్గాల్లో నోట్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు.
- 2021లో ఇదే అంశంపై నిర్వహించిన సర్వేలో 11 శాతం మంది సురక్షితం కాని మొబైల్ ఫోన్‌లో పాస్‌వర్డ్‌ను నోట్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇలా భద్రపర్చుకునే వారి శాతం రెండేళ్లలో ఆరు శాతం మేర పెరిగింది.
- ఇక బ్యాంకింగ్, ఏటీఎం కార్డుల పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకుంటారా? అని 10,962 మందిని ప్రశ్నించగా.. 67 శాతం మంది లేదని సమాధానం ఇచ్చారు.
- 24 శాతం మంది మాత్రం కుటుంబ సభ్యులకు, ఆరు శాతం మంది స్నేహితులు, కార్యాలయ సిబ్బందితో పంచుకున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వద్దు..

సున్నితమైన పాస్‌వర్డ్‌లను సురక్షితం కాని మొబైల్ ఫోన్‌లో నోట్ చేసుకోవడం శ్రేయస్కరం కాదని పోలీసులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు. వివిధ రకాల యాప్‌లను ఫోన్‌లో తరచూ డౌన్‌లోడ్ చేస్తూ ఉంటాం. చాలా యాప్స్‌కు యాక్సెస్ పర్మిషన్లు గుడ్డిగా ఇచ్చేస్తాం. వాటిల్లో చాలా యాప్స్ కాంటాక్ట్ లిస్ట్, ఇమేజెస్ యాక్సెస్ చేసేందుకు పర్మిషన్లు అడుగుతాయి. వాటిని ఓకే చేసుకుంటూ వెళ్తే.. డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతుంది. ఈ క్రమంలో సున్నితమైన పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం వీడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవుకు రెండో సొరంగం పూర్తి

లైనింగ్‌తో సహా పూర్తి చేసిన ప్రభుత్వం

- శ్రీశైలానికి వరద రాగానే సీఎం వైఎస్ జగన్‌చే జాతికి అంకితం
- సొరంగం ఫాల్ట్ జోన్ పనుల్లో చేతులెత్తేసిన టీడీపీ సర్కార్

- చేసి చూపించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో టన్నెల్ పూర్తి
- గాలేరు–నగరి ద్వారా 20 వేల క్యూసెక్కుల తరలింపు
- 15 రోజుల్లోనే నిండనున్న గండికోట రిజర్వాయర్
- దుర్భిక్ష రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సాగు నీరు
- సస్యశ్యామలం కానున్న 2.60 లక్షల ఎకరాలు
- 640 గ్రామాల్లోని 20 లక్షల మంది ప్రజలకు తాగు నీరు
- జలయజ్ఞం ప్రాజెక్టులను చకచకా పూర్తి చేస్తున్న సీఎం జగన్




సాక్షి, అమరావతి: వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత క్రమంలో చకచకా పూర్తి చేస్తున్నారు. పెన్నా డెల్టాకు జీవనాడులైన నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను పూర్తి చేసి, జాతికి అంకితం చేసిన సీఎం వైఎస్ జగన్.. ఇప్పుడు గాలేరు–నగరి సుజల స్రవంతి వరద కాలువలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగం (టన్నెల్) పనులను లైనింగ్‌తో సహా పూర్తి చేయించారు. దాంతో ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు–నగరి సుజల స్రవంతి వరద కాలువ ద్వారా రోజుకు 20 వేల క్యూసెక్కులు రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు తరలించనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ప్రారంభమయ్యాక అవుకు రెండో సొరంగాన్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేయడానికి జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదీ గాలేరు–నగరి సుజల స్రవంతి

శ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లో 30 రోజుల్లో 38 టీఎంసీలను తరలించి ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు, 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి తాగు నీరు అందించే లక్ష్యంతో 2005లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గాలేరు–నగరి సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 57.7 కిలోమీటర్ల పొడవున వరద కాలువ, అవుకు రిజర్వాయర్ వద్ద కొండలో 5.7 కిలోమీటర్ల పొడవున రెండు సొరంగాలు (ఒక్కోటి 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో) తవ్వకం చేపట్టారు. వైఎస్ హయాంలోనే వరద కాలువ తవ్వకంతోపాటు రెండు సొరంగాలలో అధిక శాతం పనులు పూర్తయ్యాయి. సొరంగాల్లో మట్టిపొరలు పెలుసుగా ఉండటం (ఫాల్ట్ జోన్) వల్ల 165 మీటర్ల మేర కూలిపోయింది. ఆ ప్రాంతంలో సొరంగాలను తవ్వలేక టీడీపీ సర్కార్ చేతులెత్తేసింది. ఒక సొరంగంలో ఫాల్ట్ జోన్‌కు ముందు నుంచి కాలువ (లూప్) తవ్వి.. దాన్ని వరద కాలువతో అనుసంధానం చేసి ఆరేడు వేల క్యూసెక్కులను తరలించి చేతులు దులుపుకొంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఫాల్ట్ జోన్‌లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులపై అధ్యయనం చేయించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని హిమాలయ పర్వతాల్లో రహదారులు, సొరంగాల తవ్వకానికి వినియోగించే పాలీ యురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ విధానాన్ని ఇక్కడా వినియోగించాలని నిర్ణయించారు. హిమాచల్‌ప్రదేశ్ నుంచి నిపుణులను రప్పించి పాలీయురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ విధానంలో రెండో సొరంగం ఫాల్ట్ జోన్‌లో తవ్వకంతోపాటు లైనింగ్ కూడా పూర్తి చేశారు. దీంతో ఇప్పటికే పూర్తయిన మొదటి సొరంగం, తాజాగా పూర్తయిన రెండో సొరంగం ద్వారా 20 వేల క్యూసెక్కులను వరద కాలువ ద్వారా తరలించనున్నారు. దీని ద్వారా శ్రీశైలానికి వరద వచ్చే 15 రోజుల్లోనే గండికోట జలాశయాన్ని నింపవచ్చునని అధికారులు చెబుతున్నారు.

రాయలసీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా

టీడీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల గండికోట రిజర్వాయర్‌లో 26.85 టీఎంసీలకు గాను నాలుగైదు టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీలకు 4 టీఎంసీలు నిల్వ చేయగలిగింది. పైడిపాలెం రిజర్వాయర్‌లో 6 టీఎంసీలకుగానూ ఒక టీఎంసీ నిల్వ చేసింది. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు ఏర్పడిన లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడం వల్ల 17.74 టీఎంసీలకు 4 టీఎంసీలనే నిల్వ చేసేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.వెయ్యి కోట్లు వ్యయం చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. దీంతో గండికోట రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో 26.85 టీఎంసీలు నిల్వ చేశారు. రూ.250 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో, పైడిపాలెం రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేస్తున్నారు. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు లీకేజీలు ఉన్న ప్రాంతంలో రూ.వంద కోట్లతో డయాఫ్రమ్ వాల్ వేసి.. వాటికి అడ్డుకట్ట వేశారు. తద్వారా 17.74 టీఎంసీలను నిల్వ చేస్తూ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తున్నారు.

చకచకా ప్రాజెక్టులు పూర్తి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే నెల్లూరు, సంగం బ్యారేజ్‌లు పూర్తి చేశాం. ఇప్పుడు అవుకు రెండో సొరంగంలో ఫాల్ట్ జోన్‌లో 165 మీటర్ల తవ్వకాన్ని సవాల్‌గా తీసుకొని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేయించాం. దాంతో ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను గాలేరు–నగరి కాలువ ద్వారా తరలించవచ్చు. ఆయకట్టుకు నీళ్లందించవచ్చు.

– శశిభూషణ్ కుమార్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి

జాతికి అంకితం చేయడానికి ఏర్పాట్లు

అసాధ్యమనుకున్న అవుకు రెండో టన్నెల్ తవ్వకాన్ని సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశంతో పూర్తి చేశాం. ఈ టన్నెల్‌ను సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. రాయలసీమ కరవు నివారణ పథకంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మార్గదర్శకాల మేరకు.. గాలేరు–నగరి కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కులకు పెంచడానికి అవుకు వద్ద మూడో టన్నెల్ తవ్వకం చేపట్టాం. దానిని కూడా త్వరలో పూర్తి చేస్తాం. అప్పుడు గాలేరు–నగరి ద్వారా 30 వేల క్యూసెక్కులు తరలించవచ్చు. శ్రీశైలానికి వరద వచ్చే పది రోజుల్లోనే గండికోట రిజర్వాయర్‌ను నింపి, ఆయకట్టుకు నీళ్లందించవచ్చు.

– సి.నారాయణరెడ్డి, జలవనరుల శాఖ ఇంజినీర్–ఇన్–చీఫ్

పునాది తవ్వకాల్లో రాగి నాణేల చెంబు లభ్యం

హొళగుంద(కర్నూలు): కర్నూలు జిల్లా హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో ఇంటి నిర్మాణానికి పునాది తవ్వుతుండగా సుమారు 125 ఏళ్ల నాటి నాణేలతో కూడిన రాగి చెంబు లభ్యమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన లింగాయత్ శరణ బసప్ప తన వాటాకు వచ్చిన పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇల్లు నిర్మించుకునేందుకు కూలీలతో మంగళవారం పునాదుల తవ్వకం చేపట్టాడు. ఈ సమయంలో పెద్ద రాగి చెంబు బయట పడింది. ఇందులో రాగి నాణేలు ఉన్నాయి. అయితే తవ్వకాల్లో లంకె బిందెతో పాటు బంగారు, వెండి నాణేలు లభ్యమైనట్లు పుకార్లు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు, తహసీల్దార్ హుసేన్ సాహెబ్, వీఆర్వో ప్రహ్లాద గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. యజమాని నుంచి రాగి చెంబు, నాణేలను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇందులో 125 ఏళ్ల కిందటి రాగి నాణేలను గుర్తించారు. మొత్తం 192 రాగి నాణేలు, రెండు రాగి అర్ధణాలు, రెండు ఒక రూపాయి అణాలు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. చెంబు, నాణేలను పురావస్తు పరిశోధన శాఖకు అప్పగిస్తామని వెల్లడించారు.


తవ్వకాల్లో లభ్యమైన రాగి చెంబు, నాణేలు

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

రూ.20 లక్షల విలువ చేసే 150 కేజీలు స్వాధీనం


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఓ ముఠాకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశామని తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ రాజేంద్రకు వచ్చిన సమాచారం మేరకు రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ పర్యవేక్షణలో వెంకటగిరి సర్కిల్ ఏర్పేడు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. తిరుపతి వైపు వస్తున్నఓ వాహనం అనుమానాస్పదంగా కనిపించిందనీ, దానిని ఆపి తనిఖీ చేయగా వాహనంలో 75 ప్యాకెట్లు (150 కేజీలు) గంజాయి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వెంటనే తమ సిబ్బంది కేరళ త్రిసూర్ జిల్లాకు చెందిన జిజేష్, అనకాపల్లికి చెందిన వెంకటరమణ, రామకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. అనకాపల్లి నుంచి కొనుగోలు చేసి సదరు గంజాయిని మన రాష్ట్రం నుంచి కేరళ రాష్ట్రానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రంజిత్ అనే వ్యక్తి ఓ ముఠా ఏర్పాటు చేసుకుని తరచూ గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.20 లక్షల రూపాయలు విలువ చేసే 150 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తెలంగాణ

విడిపోయినా అన్నదమ్ముల్లా కలసి ఉన్నాం

- తెలంగాణ మంత్రి కేటీఆర్
- సిరిసిల్ల జిల్లాలో రెండు ఆలయాల పునర్నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున టీటీడీ సాయం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలసి పనులు ప్రారంభించిన కేటీఆర్

సిరిసిల్ల: ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసే ఉన్నామని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇటీవల తెలంగాణలోని సిరిసిల్లలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు, ఎల్లారెడ్డిపేటలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.2 కోట్లను మంజూరు చేసింది. మంత్రి కేటీఆర్ బుధవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలసి ఈ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే పేదరికం పోతుందన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా హిందూమత ప్రచారంలో భాగంగా కొత్త ఆలయాల నిర్మాణాలకు, పాత ఆలయాల పునర్నిర్మాణం/పునరుద్ధరణకు టీటీడీ నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి సాయం చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగానే.. కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

నకిలీ విత్తన ముఠా అరెస్ట్

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరొకరు
- రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: నల్లగొండ ఎస్పీ

నార్కట్‌పల్లి: నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్ హిల్స్ ప్రాంతానికి చెందిన గోరంట్ల నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగె వేణు, అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ఓ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటకలో పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి సమీపంలో స్టోరేజీ చేశారు.అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్ మీదుగా తరలించాలని నిర్ణయించుకున్నారు. కారులో నాగార్జున, రవీంద్రబాబు, వేణు బయలుదేరారు. పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఎర్టిగా కారును తనిఖీ చేయగా రెండు బస్తాల విత్తనాలు బయట పడ్డాయి. వాటిని వ్యవసాయ అధికారులు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి మిగతా విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నర్సింహ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులపై పీడీయాక్ట్ ప్రయోగించనున్నట్లు చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/1 B-3A, Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., and Printed at Jagati Publications Limited Survey No 158/1 B-3A,Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act), Phone No. 08554 248892, 248893, Fax No. 248894 RNI Regn No. APTEL/2008/23793.